జన రాజకీయం కోసం ...

₹ 10/-

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 7 సంచిక - 18 పక్షపత్రిక సెప్టెంబర్ 16-30, 2016






# జడ్జీలూ జవాబుదారియే !

ప్రజలు, జాతీయ ప్రముఖుల సంతకాలతో రాష్ట్రపతి, ప్రధాని, సీజేఐని కలవాలని
ఆస్కీ-ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా రౌండ్‌టేబుల్ తీర్మానం



# దేశాభివృద్ధికి పెద్ద ఖర్చు లేని రోడ్‌మ్యాప్ ఇది : జేపీ

"భారతదేశంలో వనరులు ఉన్నాయి. కానీ వాటిని ఉపయోగించేందుకు సరైన వ్యవస్థలను రూపొందించటంలో మనం విఫలమవుతున్నాం" అని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. హైదరాబాద్‌లోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో 'సెంటర్ ఫర్ సివిల్ సొసైటీ' (సీసీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేపీ భారతదేశంలో పాలసీ ల్యాండ్‌స్కేప్ అనే అంశంపై ప్రసంగించారు.

"మన ప్రభుత్వ స్కూళ్లలో విద్య అధ్వాన్నంగా ఉంది. కొన్ని స్కూళ్లలో విద్యార్థులకన్నా టీచర్లు అధికంగా ఉన్నారు. వారికి వచ్చే జీతాలూ ఎక్కువే. కానీ సరైన వారిని ప్రభుత్వం ఎంపిక చేయటం లేదు. నాణ్యమైన టీచర్లను ఎంపిక చేసి సరైన ప్రమాణాల బోధన చేసేలా పర్యవేక్షణ ఏర్పాటు చేయాలి. విద్యార్థుల సంఖ్య ఆధారంగా టీచర్ల జీతభత్యాలను తగ్గించటం పెంచటం చేయాలి. ఇవికాక గ్రామీణ భారతంలోకి ఇప్పుడున్న సరికొత్త పరిజ్ఞానాన్నంతా చేరవేసే ప్రణాళికలు రూపొందించాలి. విద్యారంగంలో ప్రభుత్వం రూ.2.5 లక్షల కోట్లు ఖర్చు చేస్తోంది. వీటిని సరిగా వినియోగించటం మొదలుపెట్టాలి" అని జేపీ అన్నారు. ఆరోగ్యరంగం గురించి జేపీ మాట్లాడుతూ, "భారతదేశంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఒక్కో పడకపై 10 లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ప్రైవేటు ఆసుపత్రిలో ఈ ఖర్చు రూ.1 కోటి దాకా ఉంది. దీంతో సర్కారీ దవాఖానాల్లో ఉన్న రోగుల్ని పరిశుభ్ర వాతావరణంలో ఉంచటం లేదు. ఇది మారాలి. ఒక్కో రోగిపై కోటి కాకున్నా రూ.17-25 లక్షలయినా ఖర్చు పెట్టాలి. దేశంలోని గొప్ప డాక్టర్లు ప్రైవేటు రంగంలో ఉన్నారు. సేవలు కూడా అద్భుతంగా ఉంటున్నాయి. ప్రభుత్వాసుపత్రుల్ని వీటికి దీటుగా తయారుచేయాలి"అన్నారు. మనదేశంలో ప్రాథమిక వైద్యం ఇంకా చాలా అభివృద్ధి చెందాలని, అప్పుడు వ్యాధిని మొగ్గ దశలోనే అరికట్టవచ్చని జేపీ అన్నారు. వైద్యుల మధ్య పోటీ నెలకొల్పటం ద్వారా దీన్ని సాధించవచ్చని అన్నారు. లక్షమంది ఉండే ప్రాంతానికి 30 మంది డాక్టర్లు ఉంటే అప్పుడు రోగి తనకు నచ్చిన డాక్టర్ వద్దకు వెళ్లవచ్చన్నారు. ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందన్నారు. ఇతర దేశాల్లో వేలు పలికే మందులు మనదేశంలో రూ.10-20కే అందుబాటులో ఉన్నాయన్నారు.

వ్యవసాయం గురించి చెబుతూ, మనదేశంలో ఏటా ప్రభుత్వ ఆహార నిల్వలు పెరుగుతున్నాయని, వీటిని సక్రమంగా వినియోగించలేకపోవటం వల్ల తిండిగింజలు వృథా అవుతున్నాయని జేపీ అన్నారు. జన్యు మార్పు చేసిన విత్తనాల వల్ల ఎటువంటి ఇబ్బంది లేదని, ఒక డాక్టర్‌గా ఈ అంశంపై తనకు పూర్తి అవగాహన ఉందని అన్నారు. జీఎం పంటల్ని వ్యతిరేకించేవారు మిడిమిడి జ్ఞానంతో మాట్లాడుతున్నారన్నారు. వ్యవసాయంలో స్వేచ్ఛామార్కెట్‌తో రైతులకు ఎంత ఆదాయం పెరుగుతుందో 2012లో తాను చేసిన రైతు సత్యాగ్రహ పాదయాత్ర రుజువు చేసిందని, దీని ద్వారా తెలుగు రాష్ట్రాల్లో రైతులకు ఒక్క సీజన్‌లో ఒక్క పంటకు రూ.3600 కోట్ల లాభం చేకూరిందని అన్నారు.

ఈ దేశానికి నిజమైన ప్రభువులైన ప్రజలు పాలకులు, అధికారుల ముందు ఆత్మన్యూనతతో తలవంచుకుని వ్యవహరిస్తూ యాచిస్తున్నారని, అధికార వికేంద్రీకరణ జరిగే బాధ్యతాయుత పాలనతో ప్రజలు తలెత్తుకుని బతికే విధానాలు కావాలని జేపీ అన్నారు.

"నేను సూచించిన పరిష్కారాలు పెద్దగా డబ్బు వెచ్చించకుండా సులువుగా సాధించగలిగినవి. వీటిపై మీరూ ఆలోచించి పరిష్కారంలో భాగమవ్వండి" అని విద్యార్థులకు జేపీ సూచించారు. కార్యక్రమంలో సీసీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పార్థ్ షాహ్ కూడా పాల్గొన్నారు.

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక సెప్టెంబర్ 16-30, 2016

సంపుటి - 7 సంచిక - 18

## లోపలి పేజీల్లో...

జడ్జీలూ జవాబుదారీయే .......................... 5
స్థానిక కోర్టులు, ఎన్‌జేఏసీకి ..................... 9
స్థానిక న్యాయస్థానాల్ని పట్టణ ప్రాంతాల్లో...... 12
కంచే చేను మేసింది................................ 13
బతుకు మార్చే చదువు............................. 15
పీసా సర్వే సాక్షిగా పాఠశాల....................... 18
భారతీయ విద్యార్థులంటేనే......................... 19
భవిత నిరుద్యోగమయం........................... 21
నయాం, నవీన పిండారీలు......................... 23
60 శాతం శంకర్‌దాదా ఎంబీబీఎస్‌లే........... 25
అప్పు చేసయినా ప్రైవేటు దవాఖానకే............ 27
అప్పుల్లో కూరుకుపోయేలా చేశారు............. 28
మరమనుషులకు కూడా కన్నీరు వచ్చేలా.......... 29
సైకతస్నానం......................................... 30
ఎమ్మెల్యే నిధులను సామాజిక తనిఖీ............. 31
ఎంపీటీసీ, జెడ్పీటీసీల కొనసాగింపుపై........... 32
గాంధీ ఆసుపత్రిని సందర్శించిన ................. 33
విద్య, వైద్య రంగాలను ప్రక్షాళన చేయాలి....... 34

## సంపాదక వర్గం

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
ప్రధాన సంపాదకులు

**సంపాదక వర్గం**

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

## ఆ మూడు సంస్కరణలూ తోడైతేనే 'ఒకేసారి ఎన్నికల' కు సార్థకత



దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదనకు రాష్ట్రపతి ఆమోదం లభించటంతో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం ప్రజల అభిప్రాయాల్ని ఆహ్వానిస్తోంది. ఈ ఎన్నికల వల్ల ప్రయోజనాలను వివరిస్తూ కొన్ని వివరాలను ప్రజల అవగాహన కోసం వెబ్‌సైట్‌లో ఉంచారు. ఈ ప్రతిపాదన చాలాకాలంగా నడుస్తున్నందున రాజకీయ వర్గాలు, పౌర సమాజం, ఇతర రంగాలలోని ఆలోచనాపరుల అభిప్రాయాల గురించి చూచాయగా ఇప్పటికే కొంత అర్థమవుతుంది. పార్లమెంటు నుంచి పంచాయతీ వరకు ఒకేసారి ఎన్నికలంటే ప్రజలు గందరగోళ పడతారని కొంతమంది ఆందోళన వ్యక్తంచేస్తుంటే.. ఖర్చు తగ్గుతుందని, పాలన వేగవంతమవుతుంది వంటి సానుకూల అభిప్రాయాలు వస్తున్నాయి. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు కూడా చేయని రీతిలో అందరికీ ఓటు హక్కు ఇచ్చిన మనదేశంలో ప్రజలకు ఓటు సరిగా వేయటం తెలియదన్న ఆందోళనలు ఇంకా కొనసాగే పరిస్థితులున్నాయన్న వాదనల్ని కొట్టిపారేయలేకపోయినా, స్థూలంగా ఒకేసారి ఎన్నికల వల్ల లాభాలే ఎక్కువగా ఉంటాయని భావించవచ్చు. ఎక్కువశాతం రాజకీయ పార్టీలు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. అయితే అందరి ఆలోచనలూ ఇదే పెద్ద సంస్కరణ అనే రీతిలోనే ఉన్నాయి. ఒకేసారి ఎన్నికలు వాటంతటవే సంస్కరణ కావని ముందు స్పష్టంగా అర్థం చేసుకోవాలి. వాటికున్న పరిమితిని గుర్తించాలి. లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికలను జమిలిగా నిర్వహించటం సుదీర్ఘ సమయం పట్టే ప్రయత్నం. ఇంత ప్రయాస కేవలం ఒకేసారి ఎన్నికల కోసమైతే అక్కర్లేదు. అంత సమయం, ప్రయత్నం వెచ్చిస్తున్నప్పుడు ఎన్నికల వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేసే చర్యలు తీసుకోవటం రాజకీయ విజ్ఞత అనిపించుకుంటుంది. మనదేశం ఎప్పుడూ అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉంటోందేంటి? అని చాలామంది అడుగుతుంటారు. ఎందుకంటే- మనం నీతులు చెబుతుంటాం, నాయకులను వ్యక్తిగతంగా అంచనావేస్తుంటాం తప్ప నీతిని ఆచరించేందుకు, నీతిని నిలబెట్టేందుకు కావలసిన వ్యవస్థల్ని నిర్మించుకోవటం లేదు! 1950-60లలో మన కంటే ఎంతో వెనకబడ్డ దక్షిణ కొరియా వంటి దేశాలు ఈరోజు మనకంటే అనేకరెట్లు ముందుకు దూసుకెళ్లాయంటే అందుకు కారణం నీతిని నిలబెట్టే వ్యవస్థలను ఆ దేశాలు నిర్మించుకోవటం. కొన్ని దశాబ్దాలపాటు ఆ దేశాలు సాధించిన ప్రగతిని పట్టించుకోకుండా 21వ శతాబ్దంలో ఓ అల్లావుద్దీన్ అద్భుతంతో ఆ దేశాల్ని అధిగమించాలని మనం కలలుగంటున్నాం. అందుకే వ్యవస్థల నిర్మాణం కోసం సంస్కరణలు వంటివి అక్కర్లేనట్టు చిన్నచిన్న అంశాలనే పెద్ద మార్పులన్నట్టు భ్రమపడుతూ, భ్రమింపచేస్తూ మనకు మనమే చేటుచేసుకుంటున్నాం. దురదృష్టవశాత్తూ నిజమైన అభివృద్ధిని సాధించటానికి అడ్డదారులేవీ లేవు. గతంలో మనం అందరికంటే ఘనమైనవాళ్లమని, వర్తమానంలో మనకంటే ఇతర దేశాల్లో వాళ్లు గొప్ప వాళ్లని అపోహల్లో బతుకుతూ మనల్ని మనం మోసం చేసుకుంటున్నాం. వీటి నుంచి బైటపడాలి. మన గతంలోనూ కొన్ని తప్పులున్నాయి, ఇప్పుడు కూడా మనం ఇతరుల కంటే తక్కువేమీ కాదు. మనం చేస్తున్న ఒకేఒక్క తప్పిదం ఏమిటంటే- మనం కోరుకుంటున్న లక్ష్యాల్ని సాధించుకోవటానికి తగిన వ్యవస్థల్ని నిర్మించుకోవటానికి కావలసిన సంస్కరణల కోసం ప్రయత్నించకపోవటం. ఒకేసారి ఎన్నికల విషయంలో మనం ఈ వాస్తవాన్ని గుర్తిస్తే.. దీంతోపాటు 1) రాష్ట్రాల్లో ముఖ్యమంత్రుల్ని ప్రత్యక్షంగా ఎన్నుకోవటం 2) జాతీయ స్థాయిలో ప్రభుత్వాన్ని కూలదోయాలంటే ప్రత్యామ్నాయం ఉండేలా నిర్మాణాత్మక అవిశ్వాసాన్ని మాత్రమే అనుమతించటం 3) దామాషా ఎన్నికల పద్ధతిని ప్రవేశపెట్టటం అనే వ్యవస్థీకృత మార్పులను జోడించాలి. ముఖ్యమంత్రులను నిర్దిష్ట కాలవ్యవధికి ప్రత్యక్షంగా ఎన్నుకుంటే రాష్ట్రాల్లో మధ్యంతర ఎన్నికల సమస్య తలెత్తదు. సమాజంలో సమర్థులను కేబినెట్‌లోకి తీసుకునే అవకాశం ఏర్పడుతుంది, ఎమ్మెల్యేల పెత్తనం కూడా తగ్గి స్థానిక ప్రభుత్వాలు బలపడి ప్రజలు సుఖపడతారు. కేంద్రంలో ప్రధానిని ప్రత్యక్షంగా ఎన్నుకోవటం భారత్ వంటి సంక్లిష్ట భిన్నత్వం ఉన్న దేశంలో సాధ్యం కాదు కాబట్టి ప్రస్తుత పద్ధతిలోనే ఎన్నిక కొనసాగిస్తూ 'నిర్మాణాత్మక అవిశ్వాస తీర్మానాన్ని' మాత్రమే అనుమతించాలి. 2008లో పౌర అణుఒప్పందంపై యూపీయే ప్రభుత్వాన్ని పడగొట్టటానికి ప్రత్యామ్నాయ ఏర్పాటేమీ లేకుండానే, బీజేపీ, కమ్యూనిస్టులు అనైతిక పొత్తుతో ఏకమయ్యాయి. బీజేపీ అయితే అణుఒప్పందాన్ని సమర్థిస్తూ కూడా ఇలాంటి చర్యకు ఒడిగట్టింది. ఇలాంటి ప్రత్యామ్నాయం లేని అవిశ్వాసాల్ని అనుమతిస్తే దేశానికి నష్టం వస్తుంది. కాబట్టే నిర్మాణాత్మక ప్రత్యామ్నాయ ఏర్పాటు ఉండాలి. ముఖ్యమంత్రుల ప్రత్యక్ష ఎన్నిక, జాతీయ స్థాయిలో నిర్మాణాత్మక ప్రత్యామ్నాయం, దామాషా ఎన్నికల పద్ధతి.. ఈ మూడు మార్పుల్నీ జోడిస్తేనే ఒకేసారి ఎన్నికల ప్రయత్నానికి సార్థకత.

మీ







# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

విడి ప్రతి : రు. 10 ,
ఏడాది చందా : రు. 200
మూడేళ్ళ చందా : రు. 500

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# జడ్జీలూ జవాబుదారీయే!

**ప్రజలు, జాతీయ ప్రముఖుల సంతకాలతో రాష్ట్రపతి, ప్రధాని, సీజేఐని కలవాలని**
**ఆస్కీ-లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ రౌండ్‌టేబుల్ తీర్మానం**



**జ**డ్జీలకు కూడా పారదర్శకత, జవాబుదారీతనం ఉండాల్సిం దేనని లోక్‌సత్తా / ఎఫ్‌డీఆర్–ఆస్కీ నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం స్పష్టంచేసింది. ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని, రాజ్యాంగం పై ఎవరు ఎలాంటి వాదనల్ని చేసినా అంతిమంగా ప్రజా ప్రయోజనాలే రాజ్యాంగ స్ఫూర్తికి, ప్రతి వ్యవస్థకూ గీటురాయి అని పేర్కొంది. న్యాయ వ్యవస్థకు స్వయం ప్రతిపత్తితో పాటు జవాబుదారీతనం, పారదర్శకత ఉండాలని రౌండ్‌టేబుల్ చేసిన తీర్మానాన్ని దేశంలోని సుప్రసిద్ధ పౌరులు, అన్ని వర్గాల ప్రజల ముందు ఉంచి సంతకాలను సేకరించి రాష్ట్రపతి, ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి అందిస్తామని ప్రకటించింది.

**ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో పారదర్శకత కోసం రూపొందించిన జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ) చట్టం (99వ రాజ్యాంగ సవరణ)ను సుప్రీంకోర్టు కొట్టివేయటం, అదేసమయంలో ప్రస్తుతం నియామకాలు చేస్తున్న కొలీజియం విధానం లోపభూయి ష్టమైనదని అత్యున్నత న్యాయస్థానమే అంగీకరించటం, తాజాగా న్యాయమూర్తుల నియామకాల్లో పారదర్శకత, ఎంపిక సమయంలో చేసే చర్చల వివరాల లిఖితపూర్వక నమోదు, నిర్ణయాలు, సిఫార్సులకు ప్రాతిపదికలు వంటి అంశాలను సుప్రీంకోర్టు కొలీజియంలో సభ్యుడైన జస్టిస్ జాస్తి చలమేశ్వర్ లేవనెత్తటం.. నేపథ్యంలో 'న్యాయవ్యవస్థలో జవాబుదారీతనం–పారదర్శకత' అంశంపై అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజీ (ఆస్కీ), ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫాంస్ (ఎఫ్‌డీఆర్) సంయుక్తంగా రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించాయి. హైదరాబాద్ రాజ్‌భవన్ రోడ్డులోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కళాశాల బెల్లావిస్టా క్యాంపస్‌లో జరిగిన ఈ రౌండ్‌టేబుల్‌ను లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్, కేంద్ర హోంశాఖ మాజీ కార్యదర్శి, ఆస్కీ డైరెక్టర్ పద్మభూషణ్ పద్మనాభయ్య సమన్వయం చేయగా, న్యాయకోవిదులు, వివిధ రంగాలకు చెందిన అనుభవజ్ఞులైన ఆలోచనాపరులు పాల్గొన్నారు.**

**జేపీ మాట్లాడుతూ**, భారత ప్రజాస్వామ్యం పరిణతిని సాధించటంలో గత 25–30 ఏళ్లలో న్యాయవ్యవస్థ పాత్ర కీలకమని అన్నారు. ఎన్నికలలో పోటీచేసే వాళ్ల నేరచరిత్రలు సహా అన్ని వివరాలు బైటపెట్టేలా లోక్‌సత్తా సాధించిన చట్టం సాకారం కావటం వెనక సుప్రీంకోర్టు చొరవ ఉందన్నారు. 2 జీ స్పెక్ట్రం అక్రమ కేటాయింపులను రద్దు చేసి ప్రకృతి వనరులను బహిరంగ వేలం ద్వారానే కేటాయించాలని లోక్‌సత్తా సాధించిన పిటిషన్‌పై కూడా సుప్రీంకోర్టు సరైన రీతిలో స్పందించటం వల్లే ఈవేళ బొగ్గు, ఇతర గనుల కేటాయింపులో అవినీతి తగ్గి దేశ ఖజానాకు ఆదాయం లభిస్తోందన్నారు. రాజకీయ జోక్యం వల్ల వివాదాలు మరింత పెరిగే అవకాశమున్న అయోధ్యలో రామజన్మభూమి–బాబ్రీ మసీదు, రిజర్వేషన్లు, రాష్ట్రాల మధ్య వివాదాలు వంటివి సుప్రీంకోర్టు మాత్రమే పరిష్కరించగలదన్నారు. ఇంత ప్రాధాన్యత కలిగిన న్యాయవ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం లేకుంటే చివరకు విశ్వసనీయత దెబ్బతిని దేశం తీవ్రంగా దెబ్బతింటుందన్నారు. తమను రాజ్యాంగం ఏర్పాటు

చేయలేదని, తాము రాజ్యాంగం పరిధిలోకిరామని కొందరు న్యాయమూర్తులు వాదించే స్థాయికి ఇప్పుడు సంక్షోభం చేరుకుందన్నారు. లిఖిత పూర్వక రాజ్యాంగమున్న భారత్‌లో న్యాయవ్యవస్థ పాత్ర విస్తృతమైనది తప్ప రాజ్యాంగానికి అతీతమైనది కాదని స్పష్టంచేశారు. 'యుద్ధం మొత్తాన్ని సేనానులకే వదిలేయలేం, అలాగే న్యాయవ్యవస్థ మొత్తాన్నీ జడ్జీలకే వదిలేయలేం, ప్రజలకు న్యాయవ్యవస్థ కూడా తగిన పద్ధతిలో జవాబుదారీ కావాల్సిందే' అని జేపీ స్పష్టం చేశారు. ఇందుకోసమే లోక్‌సత్తా జడ్జీలను జడ్జీలే నియమించుకునే అప్రజాస్వామిక, నిరంకుశ కొలీజియం పద్ధతి స్థానంలో ప్రజాస్వామ్యయుత జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ (ఎన్‌జేఏసీ) బిల్లును రూపొందించి వివిధ పార్టీలను ఒప్పించి పార్లమెంటు ఆమోదాన్ని సాధించిందన్నారు.

దేశంలోనే సుప్రసిద్ధులైన సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వెంకటాచలయ్య, జస్టిస్ జేఎస్ వర్మ, జస్టిస్ వి.ఆర్ కృష్ణ అయ్యర్‌లతో ఆ బిల్లును రూపొందించిందన్నారు. పార్లమెంటులో ఒక్క రాంజఠ్మలానీ తప్ప అన్ని పార్టీల ఎంపీలు ఏకగ్రీవంగా ఆ బిల్లును ఆమోదించారన్నారు. పలు రాష్ట్రాల అసెంబ్లీలు కూడా అతితక్కువ సమయంలో ఆ చట్టాన్ని ధృవీకరించటంతో 99వ రాజ్యాంగ సవరణగా ఎన్‌జేఏసీ ఏర్పడిందన్నారు. కానీ ఎటువంటి వాదనలకూ ఆస్కారం లేకుండా సుప్రీంకోర్టు 2015లో ఆ చట్టాన్ని కొట్టివేసి కొలీజియమే కొనసాగుతుందని ప్రకటించిందన్నారు. కొలీజియం తీర్పుని రాసిన జస్టిస్ జేఎస్ వర్మ కూడా ఎన్‌జేఏసీని రూపొందించినవారిలో ఉన్నారని, పలు న్యాయకమిషన్లు, పాలనా సంస్కరణ సంఘం, కె.టి థామస్ వంటి విశ్రాంత ప్రధాన న్యాయమూర్తులు ఎన్‌జేఏసీని సమర్థించినా సుప్రీంకోర్టు పట్టించుకోలేదన్నారు.

అయితే కొలీజియం పద్ధతిలో లోపాలున్నాయన్న విషయాన్ని మాత్రం సుప్రీంకోర్టు అంగీకరించి సరిదిద్దుకోవటానికి సూచనలివ్వాలని కోరిందన్నారు. ఎన్‌జేఏసీని కొట్టివేయటాన్ని విభేదించిన సీనియర్ జడ్జీ జస్టిస్ చలమేశ్వర్ కొలీజియంలో కూడా సభ్యునిగా ఉన్నారని, నిర్దేశించిన కొలీజియం ప్రమాణాలను కూడా పట్టించుకోకుండా లిఖితపూర్వక వాదనలు లేకుండా జడ్జీలను ఎంపికచేయటం, తిరస్కరించటం జరుగటం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ సమావేశాలను బహిష్కరించారని అన్నారు. ఈ నేపథ్యంలో ఇతరత్రా ఐజేఎస్, జడ్జీల సంఖ్యను పెంచటం, లోక్‌సత్తా కృషితోనే 2009లోనే వచ్చిన స్థానిక న్యాయస్థానాలు వంటి అంశాలు ఉన్నా ఈ రౌండ్‌టేబుల్‌లో కేవలం ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని సాధించటం మీదే దృష్టి కేంద్రీకరించామన్నారు.

ఇంకో పదేళ్ల తర్వాతైనా సుప్రీంకోర్టు తన తీర్పుని వెనక్కితీసుకుని ఎన్‌జేఏసీని పునరుద్ధరిస్తుందనటంలో తనకు ఎలాంటి సందేహం లేదని, రాజకీయ వివాదాలకు ఆస్కారం లేకుండా ఎన్‌జేఏసీని సాధించాలని మాత్రం మర్చిపోకూడదని అన్నారు. ఈ నేపథ్యంలోనే కొలీజియంలో పారదర్శకతను పెంచుతూ ఎన్‌జేఏసీని రాజకీయాలకతీతంగా సాధించటం ఈ రౌండ్‌టేబుల్ ప్రతిపాదన అని తెలిపారు. మీడియాలాగే న్యాయవ్యవస్థకు కూడా నైతికతే కీలకమని, ఆ వ్యవస్థలను బలహీనపరచకుండా బలహీనతల్ని సరిదిద్దాలని అన్నారు. ఇరవైఏళ్ల కొలీజియం ఇంకొన్నాళ్లు కొనసాగినా వచ్చే పెద్ద నష్టమేమీ లేదని, దేశ సమగ్రతను, న్యాయవ్యవస్థను విశ్వసనీయతను కాపాడేలా న్యాయసంస్కరణలు ఉండాలన్నారు. ప్రభుత్వానికి, శాసనవ్యవస్థకి, న్యాయవ్యవస్థకి మధ్య విభజన రేఖలు స్పష్టంగా ఉండాలన్నారు.

**పద్మనాభయ్య మాట్లాడుతూ,** ఎన్‌జేఏసీ కోసం 1990 నుంచి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని, అయితే 2015లో అది కార్యరూపం దాల్చిందని, సుప్రీంకోర్టు కొట్టివేయటం దురదృష్టకరమని అన్నారు. ఈ లోపాన్ని సరిచేయటం అవసరమన్నారు. చట్టసభలో, ప్రభుత్వమో, న్యాయవ్యవస్థో ఆధిక్యంలో ఉండాలని రాజ్యాంగ రచనా సంఘం ఛైర్మన్ డా॥ అంబేద్కర్ భావించలేదని, ముగ్గురూ కలిసి నిర్ణయం తీసుకోవాలనే ఆయన స్పష్టంచేశారని అన్నారు.

**తమిళనాడు మాజీ గవర్నర్‌గా హైకోర్టు జడ్జీల నియామక భాగోతాన్ని పీఎస్ రామ్మోహనరావు తన ప్రత్యక్ష అనుభవం నుంచి వివరిస్తూ,** కొలీజియంలో పేర్కొన్న న్యాయమూర్తులకపట్ల ముఖ్యమంత్రి లేవనెత్తిన అభ్యంతరాలకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లెక్కచేయలేదు. చివరికి కొలీజియంలో పేర్కొన్న పేర్లు, ముఖ్యమంత్రి అభ్యంతరాలతో గవర్నర్ కార్యాలయం నుంచి కేంద్ర న్యాయశాఖకు జాబితాను పంపగా, కేంద్రంతో రాష్ట్రానికి సరైన సంబంధాలు లేని నేపథ్యంలో కొలీజియం పేర్లు యధాతథంగా ఆమోదం పొందాయి. 16-17మంది జడ్జీలను ఆ సమయంలో

నియామకం చేయగా, అందులో సగం మందిపై ఆ తర్వాత పలురకాల ఆరోపణలు వచ్చాయి. ముఖ్యమంత్రులకు, ప్రధాన న్యాయమూర్తులకు మధ్య సంబంధాలు బాగుంటే, సీజేని సీఎం విందుకు ఆహ్వానిస్తారని, ఆ విందులో తనకు కావలసిన జడ్జీలను పేర్లను కొలీజియం కోసం ముఖ్యమంత్రి ఇస్తారని అన్నారు. చివరికి రాష్ట్రపతి పాత్రను కూడా తోసిపుచ్చే రీతిలో కొలీజియం వ్యవహరిస్తోందన్నారు. ఇవన్నీ చూశాకే, న్యాయ నియామకాలను సంస్కరించటం అత్యవసరం అని తాను ఆ సమయంలోనే గట్టిగా భావించానన్నారు. న్యాయనియామకాలలో జవాబుదారీతనం, పారదర్శకత కోసం ఏర్పడిన ఎన్‌జేఏసీని సుప్రీంకోర్టు కొట్టివేయటం దురదృష్టకరమని, దీన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. న్యాయవ్యవస్థ, ప్రభుత్వాల మధ్య 'అహేల యుద్ధం' జరుగుతోందన్నారు.

**అలహాబాద్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ లక్ష్మణరావు మాట్లాడుతూ,** గత 20-25 ఏళ్లుగానే న్యాయవ్యవస్థకు, ప్రభుత్వాలకు మధ్య వివాదాలు, ఎడం పెరిగిపోతున్నాయని, రెండు వ్యవస్థల్లో ప్రమాణాలు పడిపోతున్నాయని అన్నారు. పౌరసమాజంలో అత్యున్నతమైన వ్యక్తులున్నారని, న్యాయమూర్తుల ఎంపికలో వారి పాత్రనూ పరిగణలోకి తీసుకోవాలని తన అనుభవసారంగా చెప్పారు. జేపీ చెప్పినట్టు, ప్రజాప్రయోజనాలే అంతిమంగా రాజ్యాంగ లక్ష్యమన్నారు. అమెరికాలో అధ్యక్షుడే జడ్జీలను ఎంపిక చేస్తారని, సెనేట్ చర్చిస్తుందని, ప్రజలు కూడా అభిప్రాయాలను వ్యక్తం చేసేలా విస్తృత చర్చకు ఆస్కారమిచ్చేలా వివరాలను ప్రచురిస్తారని గుర్తుచేశారు. ఈ ప్రక్రియ వెనక ఉన్న స్ఫూర్తి అంతా ప్రజాప్రయోజనాలేనని భారతదేశం గుర్తించాలన్నారు. న్యాయసంస్కరణలపై లోతుగా ఆలోచించి సరైన నిర్ణయాలు తీసుకుని అమలుచేయకపోతే తీవ్ర సంక్షోభం తలెత్తుతుందని హెచ్చరించారు. సమయం మించిపోక ముందే మేలుకోవాలన్నారు. కొలీజియం స్థానంలో తానే పారదర్శక వ్యవస్థను తీసుకురావాల్సిన నైతికతను ప్రదర్శించాల్సిన సుప్రీంకోర్టు.. ఎన్‌జేఏసీని కొట్టివేయటం అనుచిత చర్య అన్నారు.

**రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ కాకి మాధవరావు తన అభిప్రాయాల్ని చెబుతూ,** న్యాయవ్యవస్థ జవాబుదారీ కావాల్సిందేనని అంబేద్కర్ స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. జస్టిస్ జాస్తి చలమేశ్వర్ రాజీనామా చేయాలని నారిమన్ వంటి కొంతమంది మేధావులు చేస్తున్న వాదన అర్థరహితమని, చలమేశ్వర్ పక్కకు తప్పుకుంటే కొలీజియం ఒక రహస్య కార్యక్రమంలా యధావిధిగా కొనసాగుతుందని అన్నారు. ఈ రౌండ్‌టేబుల్ అభిప్రాయాలను మీడియా ద్వారా విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. జాతీయ స్థాయిలో కూడా రౌండ్‌టేబుల్ నిర్వహించి రాజ్యాంగ పరిరక్షకుడైన రాష్ట్రపతిని, ప్రధానిని కలవాలన్నారు.

పారదర్శకంగా న్యాయమూర్తుల నియామకాలు జరపటానికి ఎన్‌జేఏసీ వంటి ఏర్పాట్లకు సుప్రీంకోర్టే చొరవ చూపితే రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉంటుందని **జస్టిస్ రెడ్డప్పరెడ్డి** అన్నారు.

**ఆంధ్రప్రదేశ్ మాజీ లా సెక్రటరీ కళానిధి సత్యనారాయణ మాట్లాడుతూ**, కొలీజియంలో చర్చల వివరాలు విధిగా లిఖితపూర్వకంగా ఉండాల్సిందేనని స్పష్టంచేశారు. పారదర్శకత, జవాబుదారీతనం తమకు వర్తించవనటం ఆమోదయోగ్యం కాదన్నారు.

కొలీజియంలో మార్పులకే పరిమితం కాకుండా సాధ్యమైనంత త్వరగా ఎన్‌జేఏసీని అమలుచేసేలా ప్రయత్నాలు చేయాలని **జాతీయ పోలీసు అకాడమీ మాజీ డైరెక్టర్ కమల్ కుమార్** అన్నారు.

రాజకీయాలతో సమానంగా న్యాయవ్యవస్థలో ప్రమాణాలు గత కొన్నేళ్లుగా పడిపోతున్నాయని, ఆయారాం గయారాంల సంస్కృతి రాజకీయాలలో జరుగుతుంటే, కోర్టులలో అప్రజాస్వామికత, అవినీతి ఆరోపణలు పెరిగిపోతున్నాయని **ప్రజ్ఞాభారతి ఛైర్మన్ డా॥ హనుమాన్ చౌదరి** అన్నారు.

ఉన్నత న్యాయస్థానాలలో జవాబుదారీతనం నెలకొనేలా చర్యలు తీసుకోకుండా రాజ్యాంగ పరిరక్షకుడైన రాష్ట్రపతి ఏం చేస్తున్నారని **కేంద్ర ఆరోగ్యశాఖ మాజీ కార్యదర్శి సుజాతారావు** ప్రశ్నించారు.

కొలీజియం వంటి తాత్కాలిక ఏర్పాటు నుంచి న్యాయవ్యవస్థ జవాబుదారీతనం, పారదర్శకత, స్వయంప్రతిపత్తి కోసం శాశ్వత ఏర్పాటు జరగాలని **సీనియర్ పాత్రికేయుడు తెలకపల్లి రవి** సూచించారు. న్యాయవ్యవస్థలో ప్రస్తుతం నెలకొన్న వివాదం క్షీణస్థాయికి అద్దం పడుతోందన్నారు. అనేక న్యాయసంస్కరణలు రావాల్సి ఉందని, ఎన్‌జేఏసీతోపాటు వాటి పైనా దృష్టి పెట్టాలన్నారు. ఎన్‌జేఏసీ బిల్లులో లోపాల కారణంగా సుప్రీంకోర్టు కొట్టివేసిందన్న రవి అభిప్రాయం సరికాదని జేపీ ఈ సందర్భంగా వివరణ ఇచ్చారు. రాజ్యాంగ సవరణ ఎలా

చేయాలో ఆర్టికల్ 368 చాలా స్పష్టంగా చెబుతోందని, పలు ఎన్‌జేఏసీ కోసం సుదీర్ఘ కసరత్తు జరిగిందని చెబుతూ పౌర సమాజం నుంచి ఇద్దరు నిష్ణాతుల్ని ఎన్నుకోవాలన్న కారణంగా సుప్రీంకోర్టు ఆ చట్టాన్ని కొట్టివేయటంలో అర్థం లేదని అన్నారు. ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులతో కూడిన కమిటీ పౌరసమాజం నుంచి వారిని ఎంపిక చేస్తుందని, వారి ముగ్గురి మీదా నమ్మకం లేదంటే ఇక ప్రజాస్వామ్యానికే అర్థముండదని అన్నారు.

**సాక్షి ఎడిటోరియల్ బోర్డు డైరెక్టర్ కె. రామచంద్రమూర్తి మాట్లాడుతూ**, జవాబుదారీతనానికి న్యాయవ్యవస్థ అతీతం కాదని, ఎన్‌జేఏసీకే తన ఓటు అని ప్రకటించారు. పౌరసమాజంలోనూ గొప్ప వ్యక్తులున్నారని, జేపీలాంటి వాళ్లు కమిటీలో ఉంటే విజ్ఞులెవరికీ అభ్యంతరం ఉండదని అన్నారు. న్యాయవ్యవస్థను ప్రక్షాళన చేయటం ఎంత అవసరమో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో వెలువడుతున్న తీర్పులే తెలియచేస్తున్నాయని, పార్టీని బట్టి, వ్యక్తులను బట్టి తీర్పులు వస్తున్నాయని అన్నారు. కొలీజియంకు వ్యతిరేకంగా జస్టి చలమేశ్వర్‌కి నూరుశాతం మద్దతు తెలుపుతున్నామన్నారు.

వేగంగా మారుతున్న ఆర్థిక, సామాజిక పరిస్థితుల కనుగుణంగా తీర్పులిచ్చే అవగాహన న్యాయమూర్తులలో కొరవడుతోందని, బగ్గు కుంభకోణంలో తీర్పు లోపభూయిష్టంగా ఉన్నాయని ఆ శాఖ కార్యదర్శిగా పనిచేసిన **పి.సి పారఖ్** అన్నారు. న్యాయవ్యవస్థలో జవాబుదారీతనంతో పాటు నాణ్యతా ప్రమాణాలు పెరగాలన్నారు.

**మాజీ ఐఏఎస్ అధికారి భలేరావు మాట్లాడుతూ**, మనం అభివృద్ధి గురించి తెగ ఆరాటపడుతున్నాంగానీ పాలన గురించి పట్టించుకోవటం లేదని, పాలనా సంస్కరణల్ని ఇకనైనా పట్టించుకోకపోతే ఒకదశ దాటి అభివృద్ధి సాధ్యం కాదని, ఉన్న అభివృద్ధి కూడా నిలబడదని హెచ్చరించారు.

కోర్టుల్లో సకాలంలో న్యాయం జరగకపోతే కోర్టులు తమవి కాదని సామాన్య ప్రజలు భావించే పరిస్థితి వస్తుందని **స్థానిక ప్రభుత్వాల సాధికారత సమితి నేత, మాజీ ఎంపీ సోలిపేట రాంచంద్రారెడ్డి** అన్నారు.

న్యాయవ్యవస్థలో సంస్కరణలు సామాన్య ప్రజలకు ఎంత ముఖ్యమైనవో అర్థమయ్యాక తనలాంటి ఆర్థికవేత్తలు కూడా వీటి కోసం ప్రయత్నంలో భాగస్వాములయ్యేలా రౌండ్‌టేబుల్ సమావేశం జరిగిందని **ఆస్కీ డైరెక్టర్ జనరల్ (ఐ అండ్ సీ) డా॥ పరమిత దాస్ గుప్తా** అన్నారు.

## అధికార వికేంద్రీకరణ లేకే ప్రజలకు తెలియటంలా

సమావేశంలో మాట్లాడిన రైతు నేత (కన్సార్షియం ఆఫ్ ఇండియన్ ఫార్మర్స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్) చెంగల్‌రెడ్డి, తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ ఆవుల మంజులత ప్రస్తావించిన అంశాలు అధికార వికేంద్రీకరణ ఎంత అవసరమో పరోక్షంగా తెలియచెప్పాయి. న్యాయవ్యవస్థలోని లోపాలు తమకు ఈ రౌండ్‌టేబుల్‌లో అర్థమయ్యాయని, అయితే ఒక అంశంపై తప్పు జరుగుతుంటే ఎవరికి ఫిర్యాదు చేయాలో తమకు తెలియదని వారు చెప్పారు. తమలాంటి ప్రజలు కోట్ల మంది ఉన్నారన్నారు. ఇలాంటివి సరిచేస్తే చట్టసభలు, ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థ గురించి ప్రజలు మెరుగ్గా స్పందించగలుగుతారన్నారు. కేంద్రీకృత పాలన వల్లే ప్రజలకు ఓటుహక్కు, పాలన గురించి అర్థం కావటం లేదని, ఎక్కడో జరిగే తప్పులకు తాము ఏమీ చేయలేమనే నిర్లిప్తతతో అయినకాడికి తాత్కాలిక లబ్ధి పొందేదుకు సాంప్రదాయ రాజకీయ పార్టీల చేతిలో పావులుగా మారుతున్నారని లోక్‌సత్తా తొలినుంచీ వాదిస్తున్న సంగతి తెలిసిందే. స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేసి తలసరి రూ. 1000–2000 కేటాయిస్తే పౌరసత్వం, నాయకత్వం పెరిగి ప్రజాస్వామ్యం పరిణతి చెందుతుందన్నది లోక్‌సత్తా పరిష్కారం. న్యాయవ్యవస్థ ప్రజాస్వామికీకరణకు అధికార కేంద్రీకరణ ఎలా అవరోధంగా ఉందో ఈ రౌండ్‌టేబుల్ వెల్లడించటం ఆసక్తికరంగా మారింది.

సమావేశంలో కోవా డైరెక్టర్ మజర్ హుస్సేన్, ప్రేమ్‌చంద్, ఉషా రామచంద్రన్, శివరావు, ప్రొఫెసర్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ చలమేశ్వర్ వాదనకు రౌండ్‌టేబుల్ పూర్తి మద్దతును తెలుపుతోందని, అలాగే న్యాయమూర్తుల నియామకంలో జవాబుదారీతనం, పారదర్శకత ఉండాల్సిందేనని, తాత్కాలికగా కొలీజియంలో మార్పులతో పాటు ఎన్‌జేఏసీని కూడా ఏదోకరూపంలో శాశ్వత వ్యవస్థగా ఏర్పాటు చేయాలన్న రౌండ్‌టేబుల్ నిర్ణయాల్ని జాతీయ స్థాయిలోకి కూడా తీసుకెళ్లి అందరి సంతకాలనూ సేకరిస్తామని, సోషల్ మీడియా, ఇతరత్రా మార్గాల ద్వారా ప్రజాభిప్రాయన్ని కూడా కూడగట్టి రాష్ట్రపతి, ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖలు రాయటంతోపాటు నేరుగా కలిసి వివరించే ప్రయత్నం చేస్తామని పద్మనాభయ్య, జయప్రకాష్ నారాయణ్ తెలిపారు.

# స్థానిక కోర్టులు, ఎన్‌జేఏసీకి అడ్డంకొడుతున్న అ 'న్యాయవ్యవస్థ' పై గొంతులు పెరగాలి

అందరికీ సమాన న్యాయం లేకపోతే చెప్పుకోవటమే తప్ప అది నిజమైన ప్రజాస్వామ్యం అవదు. కొందరికి ఆగమేఘాల మీద న్యాయం, మరికొందరికి ఏళ్లు గడుస్తున్నా అన్యాయమే అనే పరిస్థితి భారత న్యాయవ్యవస్థను బీటలు వారుస్తోంది. న్యాయవ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వసనీయత ఉంటేనే ఆ దేశం మనుగడ సాగించగలుగుతుంది. భారత్‌లో న్యాయవ్యవస్థ కొన్ని గొప్ప ప్రమాణాలను నెలకొల్పి అసాధారణ సంక్షోభాలను పరిష్కరించ గలిగినప్పటికీ లోపాల్ని దిద్దుకోవటానికి అంగీకరించకపోవటంతో సంక్షోభాలు తలెత్తుతున్నాయి. రాజకీయ వ్యవస్థ పట్ల ఉన్న జుగుప్సతో, ప్రభుత్వాల పట్ల అపనమ్మకంతో ప్రజలు న్యాయవ్యవస్థను ఇంకా నమ్ముతున్నారుగానీ రాజ్యాంగ స్ఫూర్తిని పరిరక్షించాల్సిన న్యాయవ్యవస్థ స్వీయలోపాలతో సతమతమవుతోంది. పౌరసమాజంతోపాటు చివరికి న్యాయవ్యవస్థలోని కొందరు సీనియర్లు కూడా అంతరాత్మలా న్యాయవ్యవస్థ అప్రజాస్వామిక ధోరణుల్ని, ఆధిపత్యం చెలాయించాలనే రాజ్యాంగ విరుద్ధ వైఖరుల్ని ప్రశ్నిస్తున్నారు. ముందుచూపుతో న్యాయసంస్కరణలకు సహకరించాల్సిన ఉన్నత న్యాయమూర్తులు తాము ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరులమని మరచిపోయి దేవుళ్లుగా అభివర్ణించు కుంటున్నారు. రహస్య వాతావరణంలో పూజారుల్లా తమను తాము నియమించేసు కుంటున్నారు. న్యాయవ్యవస్థ మీద మితిమీరిన భారం లేకుండా కేవలం 5శాతం అంశాల మీదే దృష్టి సారించాల్సి ఉండగా, ప్రతి పనిలో వేలుపెడుతూ ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాల పరిధిలో జోక్యం చేసుకుంటోంది న్యాయవ్యవస్థ. ఈ నేపథ్యంలో న్యాయవ్యవస్థ విశ్వసనీయతను, సమర్థతను, తద్వారా రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు లోక్‌సత్తా సుదీర్ఘకాలంగా న్యాయసంస్కరణల కోసం పోరాడుతోంది. ఇందులో దశలవారీగా అనేక సంస్కరణలున్నా, ఇప్పటికే లోక్‌సత్తా సాధించిన స్థానిక న్యాయస్థానాలు, జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ) గురించి మాట్లాడుకోవాలి.

ఇటీవల నెల్లూరు జిల్లా కోట మండలం చిట్టేడు గ్రామానికి చెందిన నందిమాల శ్రీహరి అనే స్థానికంగా సత్వర న్యాయం చేయాలంటూ ఊరూరా తిరుగుతూ కాస్త పలకరించిన ప్రతి వ్యక్తితో పది నిముషాల పాటు మాట్లాడుతూ నడకయాత్ర చేశారు. 'ఉప్పు దొరకని ఊరున్నా ఫర్వాలేదు, న్యాయం దొరకని ఊరు ఉండకూడదు.. అంటూ బోర్డుతో (ఫోటోలో చూడవచ్చు) న్యాయం కోసం తపిస్తూ ఏప్రిల్ 16న యాత్ర ప్రారంభించిన శ్రీహరి కొంతకాలానికి హైదరాబాద్ చేరుకున్నారు. ఆయన ఎంతమందితో మాట్లాడినా, చివరికి మీడియాలో కథనాలు వచ్చినా సమస్యకు పరిష్కారం లభించలేదు. అదేక్రమంలో లోక్‌సత్తా కార్యాలయానికి వచ్చి వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌ని కలిశారు. శ్రీహరి అమాయకత్వాన్ని, తపనను చూసి జేపీ ప్రత్యేకించి సమయం కేటాయించి ఆయన ఘోష ఆలకించారు. స్థానికంగా న్యాయం ఉంటే పేదలకు తక్కువ ఖర్చుతో, వేగంగా న్యాయం అందుతుందనే ఆలోచన ఎంతో విలువైనదని, అందుకోసం పాదయాత్ర చేసి ప్రజలను




చైతన్యపరచటం అభినందనీయమని జేపీ అన్నారు. ఇదే ఆలోచనతో లోక్‌సత్తా 2009లో తీసుకొచ్చిన 'స్థానిక న్యాయాలయాల చట్టం' గురించి వివరించారు. మానసిక అలజడితో అస్థిమితంగా కొంత పరిధి దాటి కూడా మాట్లాడిన శ్రీహరి స్థానిక న్యాయస్థానాల గురించి తెలుసుకుని చాలా ఆనందపడిపోయారు. తన పోరాటానికి పరిష్కారం లభించిందని సంబరపడ్డారు. ఇలాంటి చట్టం వచ్చి ఏడేళ్లు దాటుతున్నా ఎందుకు అమలవటం లేదు? ప్రజల్లో చాలామందికి ఎందుకు తెలియటం లేదు? అని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక న్యాయస్థానాల వల్ల పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన చాలా కేసులు తేలిగ్గా పరిష్కారం కావటంతోపాటు ఈవ్ టీజింగ్ వంటి దశలోనే మహిళలపై దౌర్జన్యాలకు తెరపడి అత్యాచారాలు తగ్గుతాయని జేపీ వివరించారు. మహిళలపై నేరాల నిరోధానికి స్థానిక కోర్టులు కీలకమన్నారు. దేశవ్యాప్తంగా 5,000 కోర్టుల ఏర్పాటుకు అవకాశముందని, అనేకమంది న్యాయవాదులకు కూడా స్థానికంగానే ఉద్యోగ, ఆదాయ అవకాశాలు ఏర్పడతాయని, అయినా ఈ చట్టం అమలుకు రాష్ట్ర ప్రభుత్వాలు

ముందుకు రావటం లేదని తెలిపారు. స్థానిక కోర్టుల ఏర్పాటుకు కేంద్రప్రభుత్వమే నిధులిస్తుందని, వెంటనే వీటిని ఏర్పాటు చేయమని తాను శాసనసభలో ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి లేఖ రాసినా పట్టించుకోలేదని, ఇప్పటికీ తెలుగు రాష్ట్రాల్లో వీటి గురించి ఆలోచన చేయటం లేదని చెప్పారు. స్థానిక కోర్టుల గురించి ప్రజల్లో ఉన్న అవగాహనా రాహిత్యమే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ ఠాకూర్, ఇతర న్యాయమూర్తులకు, హైకోర్టులకు వరంగా మారింది. లోక్‌సత్తా కృషి వల్ల వచ్చిన చట్టంలో స్థానిక కోర్టులలో నియామకాలు, వ్యవహారాలను పర్యవేక్షించే అధికారం హైకోర్టులకు ఉంటుంది. స్థానిక న్యాయం పేరుతో రాజ్యాంగ హక్కులను కాలరాయకుండా, అనుచిత ధోరణులు తలెత్తకుండా ఉండేందుకు ఈ ఏర్పాటు అవసరం. దీన్ని ఆసరాగా తీసుకుని స్థానిక కోర్టుల ఏర్పాటుకు హైకోర్టులు గండికొడుతున్నాయి. స్థానిక కోర్టులు పెరిగిపోతే ఎక్కడ తమ వద్దకు కేసులు రావో, తమ డిమాండ్ పడిపోతుందోనన్న భయంతో ప్రజలకు మేలు చేసే చట్టాన్ని సాక్షాత్తూ హైకోర్టులే నిర్వీర్యం చేస్తున్నాయి. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఠాకూర్ కూడా ఇటీవల సత్వర న్యాయం గురించి గుడ్ల నీరు కుక్కుకున్నారు తప్ప స్థానిక కోర్టులు, స్థల ఆమోదయోగ్య పద్ధతులతో వేగంగా కేసుల పరిష్కరణ వంటి పరిష్కారాల ఊసెత్తలేదు. ఇటీవల భోపాల్‌లో కొంతమంది జడ్జీలతో కలిసి సతీసమేతంగా విందులో పాల్గొన్న ఠాకూర్.. ఆ విందుకు రాష్ట్ర ప్రభుత్వం చేత ఏకంగా రూ.6.94లక్షలు ఖర్చు చేయించి వెండి పళ్లాల్లో భోంచేసి ఖరీదైన బహుమానాలను పుచ్చుకున్నారుగానీ, స్థానిక కోర్టుల ఏర్పాటు గురించి మాట వరసకు కూడా అడగలేదు. జడ్జీల సంఖ్య పెంచటం ఓ పరిష్కారమే మాత్రమే తప్ప న్యాయవ్యవస్థలో సంక్షోభాన్ని అది పరిష్కరించలేదు అని తెలిసినా ఠాకూర్ తన పరిధి దాటి కూడా కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. స్థానిక కోర్టుల గురించి ప్రజల్లో పెద్దగా తెలియదుకాబట్టి ఓట్లు రావనే ఉద్దేశంతో రాజకీయ వ్యవస్థ కూడా వీటి గురించి మాట్లాడటం లేదు. న్యాయమూర్తులతో ఉన్న లోపాయికారీ అవసరాల రీత్యా రాష్ట్ర ప్రభుత్వాల్లోని పెద్దలు, చివరికి మీడియా కూడా స్థానిక న్యాయస్థానాలు వంటి పరిష్కారాల గురించి వాదించటం లేదు. తెలుగునాట హైకోర్టు విభజన చేయమని పోట్లాటలు పెట్టుకుంటున్నారుగానీ, వాటి కంటే ముఖ్యమైన స్థానిక కోర్టుల ఏర్పాటు గురించి మాత్రం ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు ప్రయత్నం చేయటం లేదు. లోక్‌సత్తా పనిగట్టుకుని హైకోర్టు వివాదంలో జోక్యం చేసుకుని మరీ స్థానిక కోర్టుల ఏర్పాటు గురించి విజ్ఞప్తి చేసినా పాలకుల చెవికెక్కలేదు.




ఇక మరో అంశం జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ ఏర్పాటు. న్యాయవ్యవస్థ సామర్థ్యాన్ని, విశ్వసనీయతను కాపాడటానికి ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో పారదర్శకత అవసరమని, అందుకోసం పూజారుల్లా న్యాయమూర్తులను న్యాయమూర్తులే నియమించుకునే కొలీజియం విధానాన్ని మార్చి జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జేఏసీ)ని ఏర్పాటు చేయాలని సుమారు 14 ఏళ్లపాటు పోరాడి లోక్‌సత్తా 2015లో ఎన్‌జేఏసీని సాధించిన సంగతి తెలిసిందే. ఈ బిల్లును లోక్‌సత్తా రూపొందిస్తే కొట్టివేసే ప్రమాదముందన్న ముందుచూపుతో జాతీయ స్థాయిలో సుప్రసిద్ధులైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ జేఎస్ వర్మ, జస్టిస్ వెంకటాచలయ్య, న్యాయమూర్తి జస్టిస్ వీఆర్ కృష్ణ అయ్యర్‌లతో ఎన్‌జేఏసీని లోక్‌సత్తా తయారు చేసింది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్, బీజేపీ నేతలతోపాటు ఇతర ముఖ్య పార్టీలవారినీ డా॥ జయప్రకాష్ నారాయణ్ కలిసి ఈ చట్టం కోసం ఒప్పించారు. అందుకే నరేంద్రమోదీ ప్రధానిగా ఎన్నికయ్యాక ప్రతికూల వాతావరణం ఉన్నా కూడా బీజేపీ, కాంగ్రెస్, ఇతర పార్టీలు ఏకగ్రీవంగా పార్లమెంటులో ఎన్‌జేఏసీ (99వ రాజ్యాంగ సవరణ)కి ఆమోదం తెలిపాయి. అతితక్కువ సమయంలో రాష్ట్రాల శాసనసభలు కూడా ఈ చట్టాన్ని ధృవీకరించాయి. అయితే సుప్రీంకోర్టు మాత్రం తాము ఎవరికీ జవాబుదారీ కాదంటూ ఈ చట్టాన్ని కొట్టివేసింది. సుప్రీంకోర్టు చర్య తప్పు అని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తూ ప్రపంచదేశాల అనుభవాలన్నిటినీ పుస్తకరూపంలో వివరిస్తూ జేపీ అన్ని పార్టీలకు లేఖ రాయటంతోపాటు పార్లమెంటు రాజ్యాంగ సభలాగా వ్యవహరించి సుప్రీంకోర్టుకు తన బాధ్యతను

గుర్తుచేయాలని విజ్ఞప్తి చేశారు. అయితే పార్లమెంటు ఆ సాహసం చేయలేకపోయింది. రాజకీయ వ్యవస్థ పట్ల ఉన్న ద్వేషంతో ప్రజల్లో కూడా పెద్దగా స్పందన రాలేదు. కానీ ఏదోకరోజు సుప్రీంకోర్టు ఈ తీర్పును వెనక్కితీసుకుంటుందని, రాజకీయ వ్యవస్థలో నైతికత పెరిగాక ప్రజలు కూడా ఈ తీర్పును సరిదిద్దాలని డిమాండ్ చేస్తారని జేపీ పలుమార్లు చెప్పారు. తాజాగా ఎన్‌జేఏసీపై సుప్రీంకోర్టు విచారణ ధర్మాసనంలో ఉండి కొట్టివేతను వ్యతిరేకించిన ఏకైక సీనియర్ జడ్జి జస్టిస్ జాస్తి చలమేశ్వర్.. సుప్రీంకోర్టు తప్పిదానికి వ్యతిరేకంగా మళ్లీ బలంగా గళం వినిపించారు. న్యాయవ్యవస్థకు, సమాజానికి దిశానిర్దేశం చేస్తూ నైతిక స్థయిర్యం కోల్పోయిన రాజకీయ వ్యవస్థకు చేవ చేకూర్చే ప్రయత్నం చేశారు.

ఉన్నత న్యాయమూర్తుల నియామకం, బదిలీల్లో కీలక పాత్ర పోషించే కొలీజియం సమావేశానికి హాజరుకావడానికి ఇటీవల జస్టిస్ చలమేశ్వర్ విముఖత వ్యక్తం చేశారు. ఈమేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ టీఎస్ ఠాకూర్‌కు రాసిన మూడు పేజీల లేఖ పెద్ద సంచలనమే అయింది. "కొలీజియం సమావేశంలో జరిపే చర్చలు ఏవీ రికార్డు రూపంలో లేవు. అందువల్ల సమావేశానికి హాజరుకావడంలో అర్థం లేదు. దానికి బదులు, మీరు కొలీజియం ద్వారా చేయాలనుకున్న సిఫార్సులను లిఖితపూర్వకంగా నాకు పంపితే నా అభిప్రాయాలు వ్యక్తం చేసి దాన్ని ప్రధాన న్యాయమూర్తికి తిప్పి పంపుతాను" అని ఆయన లేఖలో పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో అయిదుగురు అత్యంత సీనియర్ న్యాయమూర్తులతో కొలీజియం సమావేశం జరగాల్సి ఉండగా, జస్టిస్ చలమేశ్వర్ మినహా మిగిలిన నలుగురు మాత్రమే హాజరయ్యారు. న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన 'మెమోరాండం ఆఫ్ ప్రొసీజర్' (ఎంవోపీ) గురించి చర్చించడానికి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే చలమేశ్వర్ లేఖ నేపథ్యంలో ఈ సమావేశం చర్చ లేకుండా వాయిదాపడింది.

ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించిన జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ ఏర్పాటు కోసం ప్రభుత్వం చేసిన చట్టాన్ని కొట్టివేస్తూ 2015లో అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనంలో నలుగురు తీర్పునిచ్చినా అందుకు వ్యతిరేకంగా చలమేశ్వర్ తన భావాల్ని తీర్పులో స్పష్టంగా రికార్డు చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి, ఇద్దరు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు, కేంద్ర న్యాయశాఖ మంత్రి, ఇద్దరు పౌరసమాజ ప్రముఖుల నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీతో ఉన్నత న్యాయమూర్తుల ఎంపికకు ఎన్‌జేఏసీ చట్టాన్ని తీసుకొచ్చారు. ఈ చట్టాన్ని కొట్టివేయటం ప్రజాస్వామ్య సూత్రాలకు వ్యతిరేకమని చలమేశ్వర్ స్పష్టం చేశారు. "రాజ్యాంగబద్ధమైన పరిపాలనకు పారదర్శకతే ఆయువుపట్టు. హేతుబద్ధతకు అదో




కోణం. న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో పారదర్శకత మరింత అవసరం. కానీ కొలీజియం పనితీరు ప్రక్రియ పూర్తిగా అపారదర్శకంగా ఉంది. అది ప్రజలకుగానీ, చరిత్రకుగానీ అందుబాటులో లేదు" అని చలమేశ్వర్ అప్పుడు పేర్కొన్నారు. ఇప్పుడు కూడా ఆయన అందుకే కట్టుబడి ఉండాలని నిర్ణయించు కోవటంతోపాటు అందుకోసం ధైర్యంగా గళం విప్పారు. ఈ లేఖ తర్వాత కూడా న్యాయవ్యవస్థలో పారదర్శకత, ప్రజాస్వామిక సూత్రాల కోసం తాను పోరాడుతున్నానని చలమేశ్వర్ వివిధ వేదికల మీద స్పష్టం చేశారు.

ఇంతకుముందే అనుకున్నట్టు, జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ చట్టం, స్థానిక కోర్టులతోనే న్యాయసంస్కరణలు పూర్తికావు. న్యాయమూర్తులపై ఆరోపణలను విచారించేందుకు జ్యుడీషియల్ అకౌంటబిలిటీ చట్టం తేవటం, సమర్థులు న్యాయమూర్తులుగా వచ్చేందుకు ఐఏఎస్, ఐపీఎస్‌ల తరహాలో ఇండియన్ జ్యుడీషియల్ సర్వీస్ (ఐజేఎస్)ని ఏర్పాటు చేయటం, కింది కోర్టులు, న్యాయమూర్తుల సంఖ్యను పెంచటం, న్యాయ విచారణ పద్ధతుల్ని సులభతరం చేయటం, నేరపరిశోధనలో, పోలీసు యంత్రాంగాన్ని సంస్కరించటం వంటివి అవసరం. ఈ సంస్కరణలను సాధించేందుకు లోక్‌సత్తా తన అవిశ్రాంత కృషిని కొనసాగిస్తోంది. కానీ ఇప్పటికే వచ్చిన స్థానిక కోర్టుల్ని అన్ని చోట్లా ఏర్పాటు చేసి ఉన్నత న్యాయనియామకాల్లో కొలీజియం స్థానంలో జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్‌ని ఏదోకరూపంలో ఏర్పాటు చేస్తే.. ప్రజలకు చౌకగా సత్వర న్యాయం అందుతుంది, న్యాయవ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనం పెరిగి సంక్షోభం కొలిక్కి వస్తుంది, న్యాయవ్యవస్థ విశ్వసనీయత పెరుగుతుంది. వీటి గురించి ప్రజల్లో అవగాహన పెంచటంతోపాటు ఈ సంస్కరణల్ని సాధించే దిశగా గొంతులు పెరగాల్సిన అవసరం ఉంది.

స్థానిక న్యాయాలయాల చట్టం వచ్చిన సందర్భంగా 2009 జులై 27న లోక్‌సత్తా ప్రజల ముందుంచిన సమాచారం (మీడియా రిలీజ్)...

# స్థానిక న్యాయస్థానాల్ని పట్టణ ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేయాలి

## లోక్‌సత్తా డిమాండ్... తమ ఏళ్ల తరబడి కృషి ఫలించటం పట్ల హర్షం

గ్రామన్యాయాలయాల బిల్లు అమలులో భాగంగా పట్టణ ప్రాంతాలలో కూడా స్థానిక కోర్టుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేసింది. గ్రామాల్లో ప్రతి 50వేల జనాభాకూ, పట్టణ ప్రాంతాల్లో ప్రతి లక్ష జనాభాకూ ఓ న్యాయస్థానం అందుబాటులో ఉండాలని పార్టీ అధికార ప్రతినిధి వి. లక్ష్మణ్ బాలాజీ, ఉపాధ్యక్షురాలు ఎస్. మనోరమ అన్నారు. గత ఏడాది చివరిలో ఈ బిల్లును పార్లమెంటు ఆమోదించిందని, దీన్ని వెంటనే అమలు చేయాలని విధివిధానాలను సూచిస్తూ లోక్‌సత్తా అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ జనవరి, 2009లో ముఖ్యమంత్రికి లేఖ రాశారని, ఎన్నికలున్నాయి కాబట్టి ఎలక్షన్ నోటిఫికేషన్ వెలువడకముందే కోర్టుల ఏర్పాటుకు బడ్జెట్ కేటాయింపు తదితర చర్యలు తీసుకోవాలని కోరారని పేర్కొన్నారు. అప్పుడు పట్టించుకోని ప్రభుత్వం... ఇప్పుడు ఎన్నికలయ్యాకైనా స్థానిక న్యాయాలయాల ఏర్పాటుకు ప్రభుత్వం ముందుకు రావటం హర్షణీయమని పేర్కొన్నారు. దీనిమీద సలహాలు తీసుకునేందుకు న్యాయనిపుణులతో సమావేశం ఏర్పాటుచేయాలన్న ప్రభుత్వ నిర్ణయం మంచిదేనని, అయితే సలహాలు సమావేశాల పేరుతో సమయం వృధాకాకుండా ఈలోగా మౌలికాంశాలపై హైకోర్టుతో సంప్రదించి ఏర్పాట్లపై తగుచర్యలు ప్రారంభించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో స్థానిక న్యాయస్థానాలకు మౌలికవసతులు కల్పించటం, హైకోర్టు ద్వారా మేజిస్ట్రేట్‌ల ఏర్పాటు, సివిల్ కేసుల్లో ఆస్తి పరిమితి తదితర అంశాలపై నిబంధనల రూపకల్పన దిశగా ప్రయత్నాలు చేయాలని లక్ష్మణ్ బాలాజీ, మనోరమ సోమవారం ఇక్కడ పార్టీ ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ అన్నారు.

సామాన్యులకు త్వరితగతిన, తక్కువ ఖర్చుతో న్యాయం అందించే స్థానిక న్యాయస్థానాల ఏర్పాటుకోసం 12ఏళ్ల క్రితం లోక్‌సత్తా ఉద్యమం మొదలుపెట్టిననాటి నుంచే కృషి చేస్తున్నామని, 2003లో స్థానిక కోర్టుల బిల్లును రూపొందించి జాతీయ సలహామండలి ద్వారా 2005లో కేంద్ర కేబినెట్ ఆమోదానికి వెళ్లిందని పార్టీనేతలు పేర్కొన్నారు. రాజ్యాంగం ఆర్టికల్ 39ఎలో పేర్కొన్న 'అందరికీ సమానన్యాయం' అందించటంలో గ్రామన్యాయాలయాల ఏర్పాటు కీలకమైనదన్నారు. గ్రామన్యాయాలయాల వల్ల సామాన్యపౌరులకు కూడా తక్కువఖర్చుతో, విధానపరమైన గందరగోళం లేకుండా, స్వల్పకాలవ్యవధిలో న్యాయం అందుతుందని, ఇంటి ముందుపాలన, కంటిముందు ప్రభుత్వం తెచ్చే క్రమంలో ఇదో మైలురాయి అని వారు పేర్కొన్నారు. సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించి తక్కువ ఖర్చుతో, త్వరితగతిన తీర్పులు వెలువరించటం వల్ల సామాజికంగా ఆహ్వానించదగ్గ పరిణామాలు వస్తాయన్నారు. సామాజికాభివృద్ధి వేగంగా జరుగుతూ, ప్రతిఒక్కరూ సంపదసృష్టిలో భాగస్వాములు కావాలంటే ప్రజలకు న్యాయవ్యవస్థ పట్ల విశ్వాసం అవసరమన్నారు. గత ఏడాది బ్రిటన్‌లో హత్యకు గురైన వెంపల సామ్రాజ్య జ్యోతిర్మయి హంతకుడికి అక్కడి కోర్టు కేవలం ఏడునెలల వ్యవధిలో కఠినశిక్షను వేసిందని, మనదేశంలో 1991లో హత్యకు గురైన మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ కేసు విచారణకే కొన్నేళ్లు పట్టే పరిస్థితి ఉందన్నారు. గ్రామన్యాయాలయాల ఏర్పాటుతో సామాన్యుడికి న్యాయం త్వరితగతిన అందుతుందని, ప్రజల్ని రాజ్యాంగబద్ధ పౌరులుగా చేయగలమని అన్నారు. అందుకే ప్రతి పౌరునికీ సత్వరన్యాయం అందించటం తమ పార్టీ మౌలికవిధానాల్లో ఒకటని వారు పేర్కొన్నారు.

"ఈరోజు మనరాష్ట్రంలో సుమారు 11లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాల్లో దాదాపు 9.5లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. న్యాయం ఆలస్యం కావటం వల్ల చట్టం పట్ల ప్రజల్లో విశ్వాసం పోతోంది. నిస్పృహను తట్టుకోలేక అసలు కోర్టుల పక్కకే రాని కేసుల సంఖ్య పెండింగ్ కేసుల కంటే కూడా ఎక్కువవుతోంది. దీన్ని ఆసరాగా తీసుకుని రౌడీదర్బార్‌ల సంఖ్య పెరుగుతోంది. గూండాలు, రాజకీయ నాయకులు కుమ్మక్కయి యధేచ్ఛగా భూకబ్జాలు, ప్రజాధనం లూటీలు చేస్తున్నారు. ఈ నేరరాజకీయాల్ని మార్చాలంటే స్థానిక కోర్టులు ఏర్పాటే పరిష్కారం" అని లోక్‌సత్తా నేతలు అన్నారు. స్థానిక న్యాయస్థానాల్లో తెలుగులోనే విచారణ జరిగేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. అలాగే, మొబైల్‌కోర్టులను ఏర్పాటుచేసి న్యాయవ్యవస్థ ప్రతి ఒక్కరికీ చేరువ అయ్యేలా చేయటానికి తగిన చర్యలు చేపట్టాలని వారు కోరారు.

**జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్‌ను కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పునిచ్చిన అక్టోబర్ 16, 2015న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు చేసిన బహిరంగ ప్రకటన (మీడియా రిలీజ్) ...**

# కంచే చేను మేసింది!

**ఎన్‌జేఏసీని కొట్టివేస్తూ సుప్రీంకోర్టు తీర్పుని ప్రజలు తిరస్కరించాలి,**
**ఇది రాజకీయ పోరాటం కాదు, రాజ్యాంగ రక్షణ కోసం జాతిపోరాటం: జేపీ**
**పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి**
**పార్టీలకతీతంగా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి**



ఉన్నత న్యాయమూర్తుల నియామకంలో పార్లమెంటుకు, ప్రభుత్వానికి, పౌరులకు భాగస్వామ్యం కల్పించే జాతీయ జ్యుడీషియల్ అపాయింట్‌మెంట్స్ (ఎన్‌జేఏసీ) చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేయటం రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధం, ప్రజలు, పార్లమెంటు నిర్ద్వంద్వంగా ఈ తీర్పుని తిరస్కరించాలి అని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగాన్ని తూ నాబొడ్డు అని సుప్రీంకోర్టే అనటం సాధారణ విషయం కాదు, ఇది రాజకీయ పోరాటం కాదు, జాతిపోరాటం అన్నారు. దేశ చరిత్రలోనే కీలక ఘట్టమైన ఈ తీర్పు మీద పార్లమెంటు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి లోతైన చర్చతో రాజ్యాంగ, ప్రజాస్వామ్య సూత్రాలని, పార్లమెంటు సార్వ భౌమాధి కారాన్ని పరి రక్షించాలన్నారు. కంచే చేను మేసినట్టు అత్యున్నత న్యాయస్థానం వ్యవహ రించిందని, రాజ్యాంగాన్ని ధిక్క రించిందని అన్నారు. సుప్రీంకోర్టుకు స్వయంప్రతిపత్తి రాజ్యాంగం నుంచి వస్తుంది తప్ప రాజ్యాంగాన్నే కాదనే అధికారం సుప్రీంకోర్టుకు లేదన్నారు. న్యాయమూర్తులు స్వయంభులు, దైవదూతలు, దైవాంశసంభూతులు, చక్రవర్తులు కాదని, రాజ్యాంగ, ప్రజాస్వామ్య సూత్రాలకు లోబడి పనిచేయాల్సిందేనన్నారు.

**ఎన్‌జేఏసీని ఏర్పాటుకు పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదించిన 99వ రాజ్యాంగ సవరణను కొట్టివేస్తూ, జడ్జీలను జడ్జీలే నియమించుకునే పాత కొలీజియం వ్యవస్థనే కొనసాగించాలంటూ సుప్రీంకోర్టు శుక్రవారం ఇచ్చిన తీర్పుపై జయప్రకాష్ నారాయణ్ ఇక్కడ అమీర్‌పేటలోని లోక్‌సత్తా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ,** ప్రపంచంలోని మరే ప్రజాస్వామ్య దేశంలోనూ ఇలా మాట్లాడే సాహసాన్ని న్యాయవ్యవస్థ చేయదని, కానీ రాజకీయం దిగజారి, అరుపులు, నినాదాలు తప్ప విధానాల సంక్లిష్టతల గురించి అవగాహన తక్కువ ఉండటం వల్ల మనదేశంలో ఇలాంటి తీర్పుని ఇచ్చారని అన్నారు. ఏ ప్రజా స్వామ్య దేశం లోనైనా జడ్జీలను జడ్జీలే నియమించు కోరన్నారు. ఫ్రాన్స్, కెనడా, బ్రిటన్ తదితర దేశాల న్నిటిలో ఉన్నత న్యాయ మూర్తుల నియామకంలో ప్రభుత్వాల, పార్లమెంటుల పాత్ర ఉంటుం దన్నారు. చాలా దేశాల్లో సమాజంలోని పౌరులకు కూడా అవకాశం కల్పిస్తారన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తిని సంప్రదించి ఉన్నత న్యాయ మూర్తులను నియమించమని రాజ్యాంగంలో పదజాలం ఉంటే, దానికి విపరీతార్థాలు చెప్పి ప్రపంచంలో ఏ ప్రజాస్వామిక దేశంలోనూ లేనిరీతిలో జడ్జీలను జడ్జీలే నియమించుకునే విడ్డూరమైన కొలీజియం వ్యవస్థని మన సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిందని, ఈ తరహా వ్యవస్థనే కొన సాగించాలను కుంటోందన్నారు.

దైవదూతల్లా, దైవాంశసం భూతుల్లా తమను తామే నియమించ కుంటామని, ప్రభుత్వం, ప్రజలతో తమకు సంబంధం లేదని చెప్పటం ద్వారా సుప్రీంకోర్టు తన విశ్వసనీయతను తానే తగ్గించుకుందని జేపీ అన్నారు. దేశంలో సంక్లిష్టమైన మందిరం-మసీదు, రిజర్వేషన్లు, నదీజలాల పంపిణీ, ఆంధ్ర-తెలంగాణ వంటి రాష్ట్రాల మధ్య తగాదాలు వంటి ఘర్షణలు తలెత్తినప్పుడు రాజకీయం వాటిని పరిష్కరించటం కష్టమని, అటువంటి పరిస్థితుల్లో విశ్వసనీయమైన సుప్రీంకోర్టు అవసరమని, ఇలాంటి తీర్పులతో సుప్రీంకోర్టు తన విశ్వసనీయతను కోల్పేయి దైవదూతలం, దైవాంశసంభూతులం అంటూ వ్యవహరిస్తే ఉపద్రవాలు ముంచుకొచ్చి దేశ సమగ్రత కూడా ప్రమాదంలో పడుతుందన్నారు.

దేశం కన్నా న్యాయవ్యవస్థ ఎక్కువ కాదని, ప్రజాస్వామ్యంలో ఏ వ్యవస్థయినా ప్రజల మద్దతును ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా పొందాల్సిందేనని, అలా ప్రజలతో సంబంధం

లేని వ్యవస్థలకు విశ్వసనీయత, నైతికత ఉండదని జేపీ స్పష్టంచేశారు. పార్లమెంటు, పౌరులు, ప్రభుత్వం పాత్ర అక్కర్లేదు అంటే ఇక కలెక్టర్లని కలెక్టర్లు, ఎన్నికల సంఘాన్ని ఎన్నికల సంఘం, యూపీఎస్‌సీని యూపీఎస్‌సీ, ఇలా ప్రతి వ్యవస్థా తనను తానే నియమించుకోవచ్చని, రేపు ఎన్నికలు, పార్లమెంటు కూడా అక్కర్లేదనవచ్చని అన్నారు. ఈ ధోరణి అరాచకత్వానికి, నియంతృత్వానికి దారితీస్తుందన్నారు.

భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26, 1949న డా॥ అంబేద్కర్ మాట్లాడుతూ, ఈ రాజ్యాంగం విఫలమైతే తప్పు రాజ్యాంగానిది కాదు, దాన్ని అమలు చేసే వారిదేనని హెచ్చరించిన విషయాన్ని జేపీ ఉటంకించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన సుప్రీంకోర్టే ఈవేళ రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడిందన్నారు. దేశ చరిత్రలో ఇది కీలకఘట్టమని, 99వ రాజ్యాంగ సవరణతో ఈ చట్టాన్ని తీసుకురావటానికి లోక్‌సత్తా 14-15 ఏళ్ల పాటు పోరాటం చేసిందని అన్నారు. విజ్ఞతకు, నిర్భీతికి మారుపేరైన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ ఎంఎన్ వెంకటాచలయ్య, జస్టిస్ జేఎస్ వర్మ, న్యాయమూర్తి జస్టిస్ కృష్ణయ్యర్‌లను ఒకచోటకి చేర్చి ఈ బిల్లును రూపొందించిందని, పదేళ్ల పాటు కృషి చేసి అన్ని పార్టీలనూ ఒప్పించిందని అన్నారు. అందుకే ఉప్పునిప్పులా ఉండే ఎన్డీయే, యూపీయేలు ఏకగ్రీవంగా పార్లమెంటులో 2014 డిసెంబర్‌లో ఈ బిల్లును ఆమోదించాయని గుర్తుచేశారు. ఎంతో నిజాయతీతో, ముందుచూపుతో, అత్యుత్తమ న్యాయమూర్తుల భాగస్వామ్యంతో లోక్‌సత్తా రూపొందించింది కాబట్టే పార్టీలకతీతంగా అది ఆమోదం పొందిందన్నారు.

**ఇంప్లీడ్ అవుతానన్నా బెంచ్ అవకాశం ఇవ్వలేదు, ఎన్‌జేఏసీపై కృషి, సమాచారం పుస్తకరూపంలో అందరికీ, స్పందించిన సోనియా**

ఈ బిల్లు వెనక కృషిని, వివరాలను పుస్తకరూపంలో రాష్ట్రపతికి, ఉపరాష్ట్రపతికి, ప్రధానమంత్రికి, ప్రతిపక్ష నేతకు, అన్ని పార్టీలకు, పార్లమెంటు సభ్యులందరికీ పంపించామని, లేఖ రాశామని, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఇప్పటికే ఎన్‌జేఏసీకి మద్దతిస్తామని తిరిగి లేఖ రాశారని తెలిపారు. ఆ పుస్తకాన్ని, లేఖలను మీడియాకు జేపీ విడుదల చేశారు. ఎన్‌జేఏసీపై వాదనల సమయంలో ఇంప్లీడ్ కావటానికి తాను అభ్యర్థించినా సుప్రీంకోర్టు బెంచ్ అనుమతించలేదని, వారికి కూడా ఈ వివరాలు పంపానని తెలిపారు. ఈ చట్టంలోని సంక్లిష్ట దేశ ప్రయోజనాలను గుర్తించి సంయమనంతో తీర్పునివ్వాలని కోరానన్నారు. కానీ వారికి విషయం బోధపడకో, ఏం చేసినా చెల్లుతుందని భావించో, రాజ్యాంగానికి వేరే భాష్యం అనుకునో ఎన్‌జేఏసీని వ్యతిరేకిస్తూ తీర్పునిచ్చారన్నారు.

## ఢిల్లీకి జేపీ

శనివారం ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతి సహా అందరినీ కలిసి మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తానని జేపీ తెలిపారు. పార్లమెంటు అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ తీర్పుపై కనీసం వారంరోజులపాటు చర్చించాలని, సుప్రీంకోర్టు రాజ్యాంగవ్యతిరేక తీర్పునకు వ్యతిరేకంగా పార్లమెంటు సార్వభౌమత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు నడుం బిగించాలని, ఇది ప్రభుత్వ, పార్టీల వ్యవహారం కాదని అన్నారు. ఈ తీర్పును సరిచేసి, న్యాయమూర్తులు దైవాంశసంభూతుల్లా తమను తాము నియమించుకోకుండా, ఉన్నత న్యాయమూర్తుల నియామకాలు పారదర్శకంగా జరిగేలా పభుత్వం, పార్లమెంటు చర్యలు తీసుకోవాలన్నారు. దేశంలోని అన్ని రాజ్యాంగసంస్థల నిష్ణాతుల్ని, ప్రపంచదేశాల నిపుణుల్ని పిలిపించి ప్రజలకు వాస్తవాలు అర్థమయ్యేలా చర్చ చేయాలని, న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామిక ప్రాతినిధ్యాన్ని కాపాడేలా ఏకాభిప్రాయాన్ని సాధించాలని అన్నారు. మీడియా దేశవ్యాప్తంగా ఈ కీలక తీర్పుపై ప్రామాణిక చర్చ జరిపి ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు.


**రాజకీయాలు దిగజారటం వల్లే ఇంతదాకా వచ్చింది, ప్రక్షాళనపైనా పార్లమెంటు కళ్లు తెరవాలి**

దాంతోపాటు అసలీ పరిస్థితి ఇక్కడిదాకా రావటానికి రాజకీయాలు దిగజారటమే కారణమని పార్లమెంటు గుర్తించాలని జేపీ అన్నారు. అవినీతి, గూండాయిజం వంటి వాటితో రాజకీయం దిగజారటం వల్లే ప్రజలు రాజకీయానికి ప్రత్యామ్నాయంగా న్యాయవ్యవస్థ మీద మితిమీరి ఆధారపడుతున్నారని, ఆ ధోరణి కొనసాగితే అది ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్నే హరించివేస్తుందని అన్నారు. మన ప్రజాస్వామ్యంలో, రాజకీయంలో ఉన్న లోపాలపై లోక్‌సత్తా చేసినంత పోరాటం గత ఇరవైఏళ్లలో ఎవరూ చేయలేదని, అధికారం లేకుండానే 99వ రాజ్యాంగసవరణ సహా 15 మౌలిక మార్పుల్ని శాంతియుతంగా సాధించి చూపిందని, కానీ రాజకీయాల్లో మార్పునకు రాజకీయాలను ద్వేషించటం కాకుండా మరింత మరింత మంచి రాజకీయం దిశగా ప్రక్షాళన చేయటం, అత్యుత్తములు ఎన్నికయ్యే అవకాశాన్ని కల్పించటమే మార్గమని ఆచరించి చూపిందని అన్నారు. రాజకీయాలలో విశ్వసనీయత, నైతికత పెంచటానికీ పార్లమెంటు నడుం బిగించాలన్నారు.


"నిజాయతీ, నిష్పాక్షికత, రాజ్యాంగం పట్ల గౌరవం, రాజకీయాల్లో, వ్యవస్థల్లో మౌలికమార్పు కోసం అసాధారణ కృషి అర్హతలుగా ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా ఈ పోరాటానికి పిలుపునిస్తోంది. కానీ ఈ పోరాటం చేయాల్సిన బాధ్యత, అధికారం పార్లమెంటుది, పౌరసమాజానిది. లోక్‌సత్తా తన వంతు పాత్ర పోషిస్తుంది" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

# బతుకు మార్చే చదువు

- ప్రకాష్ జవదేకర్,
కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి




ఒక వ్యక్తి, కుటుంబం, సమాజం, జాతి జీవనంలో విద్య అన్నది ఎంతో ముఖ్యమైన అభివృద్ధి కారకం. సరైన విద్యాబుద్ధులు నేర్పించగలిగితేనే మెరుగైన, నిపుణత కలిగిన మానవ వనరులను రూపొందించగలం. పరిశోధన, నవీకరణలను ప్రోత్సహించి, సంబంధిత సామర్థ్యాలను పెంపొందించడంలో జాతికి విద్యే తోడ్పడుతుంది. వ్యక్తిత్వాన్ని, శీల సంపదను, విలువలతో కూడిన జీవన విధానాన్ని అలవరచడం ద్వారా ఒక వ్యక్తిని విశ్వమానవుడిగా తీర్చిదిద్దగలిగేది విద్యే. అందువల్లే, విద్యావ్యవస్థను సంస్కరించడానికి ప్రతి దేశమూ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఎప్పటికప్పుడు విద్యావిధానాన్ని సమీక్షించుకుంటోంది. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఈ విషయంలో ఎన్నో ప్రధాన చర్యలు చేపట్టారు. తొలుత ముదలియార్ కమిషన్‌ను, తరువాత కొఠారి కమిషన్‌ను ఏర్పాటు చేశారు. 1986లో జాతీయ విద్యావిధానాన్ని రూపొందించారు. 1992లో దాన్ని సవరించారు. అది జరిగి పాతికేళ్లయింది. స్థితిగతులు మారుతున్నాయి. అందుకు అనుగుణంగా ప్రజల అవసరాలూ మారుతున్నాయి. నాణ్యమైన విద్య, నవీకరణలు, పరిశోధనలను




వారు కోరు కుంటున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని జాతీయ విద్యా విధానాన్ని సమీక్షించాల్సిన అవసరం ఉంది. ఈ దిశలో నిరంతరం ప్రయత్నాలు జరగాలి. విస్తృత ఏకీభావం, సమగ్ర చర్చలు, సంప్రతింపుల ద్వారా కొత్త విద్యావిధానాన్ని తీసుకొచ్చేందుకు మనమంతా కృషి చేయాలి. అందుకోసమే ప్రభుత్వం నిరుడు జనవరిలో ఈ సమీక్ష ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.

**విస్తృత సంప్రతింపులు**

పాఠశాల విద్యకు సంబంధించి 13 అంశాలను ఎంపికచేయడం జరిగింది. అభ్యసన ఫలితం, మాధ్యమిక విద్య, వృత్తివిద్య, పరీక్షలు, ఉపాధ్యాయ విద్య, సమాచార సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, బోధనాభ్యాసన ప్రక్రియ, పాఠశాల విద్యావిధానాలు, సమ్మిళిత విద్య, భాష, బాలల ఆరోగ్యం వంటివి వాటిలో ఉన్నాయి. పాఠశాల విద్యకు సంబంధించి ఈ అంశాల ఔచిత్యం గురించి ప్రతి ఒక్కరికీ తెలుసు. ఇంకెవరైనా, ఏమైనా సూచనలూ చేయవచ్చు. ఉన్నత విద్య విషయంలో 20అంశాలను ఎంపిక చేశాం. ఉన్నత విద్య నిర్వహణ, నాణ్యత, నియంత్రణ, కేంద్ర సంస్థలు, రాష్ట్ర విశ్వవిద్యాలయాలు, నైపుణ్యాభివృద్ధి, సార్వత్రిక విశ్వవిద్యాలయాలు, ప్రాంతీయ అసమానతలు, లైంగిక, సామాజిక అసమానతలు, సామాజిక అనుసంధానం, భాష, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో (పీపీపీ) ఆర్థిక వనరులు, పరిశ్రమలతో అనుసంధానం, పరిశోధన, నవీకకరణ, నవీన పరిజ్ఞాన సముపార్జన వంటివి ఈ 20 అంశాల్లో ఉన్నాయి. ఇంకా అనేక అంశాల గురించీ ఆలోచించవచ్చు. 2015 జనవరి 26న www.MyGov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ సంప్రతింపుల రూపేణా ఈ ప్రక్రియ ప్రారంభమైంది. అందులో ప్రజల ముందు కొన్ని ఆలోచనలు ఉంచటంతోపాటు వారి అభిప్రాయాలు, సూచనలు కోరడం జరిగింది. గతేడాది అక్టోబరు 31నాటికే దానిపై 29,000కు పైబడి స్పందనలు అందాయి.

ఈ ప్రక్రియ మీద 2015 మేలో 1,10,000 గ్రామాలు, 3,015 బ్లాకులు, 406 జిల్లాలు, 962 స్థానిక సంస్థల్లో అట్టడుగు స్థాయిలో సంప్రతింపులు మొదలయ్యాయి. వివిధ విద్యాకమిటీల సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, విద్యావ్యవస్థతో సంబంధం ఉన్నవారంతా ఈ అంశాలపై చర్చలు జరిపి, సూచనలు చేశారు. పాఠశాల, ఉన్నత విద్యారంగాలపై 21 రాష్ట్రాలూ తమ స్పందనలు తెలియచేశాయి. ఆ ప్రక్రియ పూర్తి అయ్యాక 2015 సెప్టెంబర్, అక్టోబర్‌లలో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆరు జోనల్ మీటింగులు జరిగాయి. అందులో పాలుపంచుకొన్న అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ సూచనలు అందజేశాయి. అనేక రాష్ట్రాల విద్యామంత్రులూ ఈ జోనల్ సమావేశాల్లో పాల్గన్నారు.

ఈ చర్చలు, సంప్రతింపుల దరిమిలా అందిన సూచనలు కొన్ని లక్షల పేజీలు దాటాయి. వాటిని క్రోడీకరించి, వర్గీకరించేందుకు టీఎస్ఆర్ సుబ్రమణియన్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. కొత్త విద్యావిధాన ముసాయిదా రూపకల్పన కోసమే ఈ కమిటీని నియమించారంటూ కొందరు అర్థాలు తీశారు. సూచనల్లో చాలావాటిని సుబ్రమణియన్ కమిటీ పరిశీలించింది. సంబంధిత పక్షాలతో కమిటీ అనేక సమావేశాలు నిర్వహించింది. 99 సంస్థలతో స్వతంత్రంగా అయిదు ప్రాంతీయ సమావేశాలు జరిపింది. ఈ సందర్భంగా కమిటీకి 120 సూచనలు అందాయి. ఈ సంప్రతింపుల ప్రక్రియ ముగిశాక, ముసాయిదా జాతీయ విద్యావిధాన రూపకల్పనపై భారత ప్రభుత్వానికి తన సిఫార్సులను కమిటీ అందజేసింది. (http://www.nyepa.org/New/download/NEP 2016/ReportNEP.pdf). కింది నుంచి పైస్థాయి దాకా సాగిన సంప్రతింపుల ప్రక్రియ సందర్భంగా వచ్చిన సూచనలు, వాటితోపాటు సుబ్రమణియన్ కమిటీ చేసిన సిఫార్సులూ కొత్త

విద్యావిధానంపై విస్తృతస్థాయి చర్చ ప్రారంభించడానికి కీలక ముడిసరకులుగా ఉపయోగపడతాయి. అంతేతప్ప, సుబ్రమణియన్ కమిటీ సిఫార్సులనే ముసాయిదా కొత్త విద్యావిధానంగా భావించరాదు. ఈ విషయాన్ని అంతా అర్థం చేసుకోవాలి. ఎందుకంటే, అదింకా క్యాబినెట్ ముందుకు రాలేదు. దానిమీద క్యాబినెట్ ఆమోదముద్రా వేయలేదు. అందువల్ల, కొత్త ముసాయిదా విద్యావిధానం కోసం రూపొందించిన ముసాయిదాగానే దాన్ని పరిగణించాలి.

కొత్త విద్యావిధానాన్ని ఏ ప్రాతిపదిక మీద రూపొందించాలనుకుంటున్నామో ఈ సందర్భంగా స్పష్టం చేయదలచాను. భారత్ ముందు నిలిచిన సవాళ్లను అధిగమించి, ప్రతి ఒక్కరికీ అవకాశం ఇచ్చేందుకు వీలుగా చేరువ, అందుబాటు, నాణ్యత, నిష్పాక్షికత, జవాబుదారీతనం అనే అయిదు మూలస్తంభాల మీద కొత్త విద్యావిధానమనే భవంతిని నిర్మించదలిచాం. గడచిన 70 ఏళ్లలో విద్యను అందరి ముంగిళ్లకూ తీసుకెళ్లగలిగాం. ప్రాథమిక నుంచి ఉన్నత విద్య దాకా అన్ని స్థాయుల్లో విద్య నాణ్యతను మెరుగుపరచి, ప్రామాణిక విద్యను అందించటం ఎలాగన్నది ఇప్పుడు మనముందున్న అతిపెద్ద సవాలు. అందువల్ల, కొత్త విద్యావిధానంలో నాణ్యతా ప్రమాణాలకే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వబోతున్నాం. సామాజిక న్యాయం, నిష్పాక్షికత అన్నవి కొత్త విధానంలో అవిభాజ్యంగా, అతర్నిహితంగా ఉంటాయి. ఈ కీలకాంశాలను పొందుపరచడం ద్వారా సమ్మిళిత విద్యావ్యవస్థకు రూపకల్పన చేయాలన్నది మరో ముఖ్య లక్ష్యం. విద్య నాణ్యతా ప్రమాణాలను పెంపొందించడం, అన్ని స్థాయుల్లోని విద్యార్థులకు సమానావకాశాలు కల్పించడం ఎలాగన్నది మనముందున్న అసలైన సవాలు. అందుకే, ఈ విషయంలో మీ విలువైన సూచనలు ఇవ్వవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నాను. 43 పేజీల Some inputs for Draft NEP 2016 (http://www.mhrd.gov.in/sites/upload Files/mhrd/Files/inputs Draft NEP 2016 1.pdf) పై సూచనలు సమర్పించడానికి గడువును ఇప్పటికే 2016 సెప్టెంబర్ 30 వరకు పొడిగించాం. ఇటీవల ముగిసిన పార్లమెంటు వర్షాకాల సమావేశాల సందర్భంగా కొత్త విద్యావిధానంపై రాజ్యసభలో స్వల్పకాలిక చర్చ సైతం జరిగింది. ఆ సమయంలో సభ్యులు విలువైన సూచనలు చేశారు. రాజ్యసభలో కొంతమంది సభ్యులు చేసిన డిమాండు మేరకు విద్యారంగంపై ఆసక్తి వున్న, విద్యారంగంలో పనిచేసిన ఎంపీల కోసం కొత్త విద్యావిధానం మీద కార్యశాల (వర్క్‌షాప్) నిర్వహించాలని యోచిస్తున్నాం.

**సూచనలకు ఆహ్వానం**

కొత్త విద్యావిధానంపై రాజకీయం చేయడానికి కొంతమంది ప్రయత్నిస్తున్నారు. విద్య అన్నది జాతీయ అంశం. ఏదో ఒక పార్టీకి చెందిన వ్యవహారం కాదు. అందువల్ల అలా జరగరాదని కోరుకుంటున్నాను. ప్రభుత్వం ఉద్దేశం మీద అనవసరంగా అనుమానాలు రేకెత్తిస్తున్నారు. అపోహలు కలిగిస్తున్నారు. దుష్ప్రచారం చేస్తున్నారు. దానివల్ల ఎలాంటి ఉపయోగమూ ఉండదు. ఏరకమైన ఫలితమూ ఒనగూడదు. రాజ్యాంగంలోని 29,30 అధికరణల్లో పొందుపరచిన మైనారిటీ విద్యాసంస్థల హక్కులను కాలరాయబోతున్నారంటూ కొన్నిచోట్ల కొంతమంది నిరసనలు వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. రాజ్యాంగంలో హామీ ఇచ్చిన ఏ హక్కుకూ విఘాతం కలిగించే ఉద్దేశం మాకెంత మాత్రం లేదని ఈ సందర్భంగా స్పష్టం చేస్తున్నాను. పైపెచ్చు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, ఓబీసీలు సహా సమాజంలోని అణగారిన వర్గాలు అన్నింటికీ సమాన విద్యావకాశాలు కల్పించడానికి గట్టి చర్యలు తీసుకోవాలని సంకల్పించాం. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ స్పష్టమైన దృక్పథంతో ఉన్నారు. నిర్దిష్ట మార్గనిర్దేశం చేస్తున్నారు. పదేళ్ల విరామం తరువాత ఇటీవల జరిగిన అంతర్రాష్ట్ర మండలి సమావేశంలో చర్చకు వచ్చిన నాలుగు అంశాల్లో నాణ్యమైన విద్య అన్నది ఒకటి. దానిపై జరిగిన చర్చలో నేనూ పాలుపంచుకొన్నాను. ముఖ్యమంత్రులు చెప్పింది విన్నాను. ఎంతో సంతోషం కలిగింది. విద్య నాణ్యతా ప్రమాణాలను మెరుగుపరచాల్సిన అవసరాన్ని వారంతా నొక్కి చెప్పారు. అందుకోసం తమ ప్రభుత్వాలు చేపడుతున్న చర్యలను వివరించారు. ఇదొక శుభారంభం. ప్రస్తుత కాలమాన పరిస్థితుల్లో ఎదురవుతున్న సవాళ్లను సమర్థంగా అధిగమించడంతోపాటు రాబోయే తరాలకూ భవ్యమైన భవిష్యత్తుకు మార్గం ఏర్పరచడానికి, తద్వారా దేశాన్ని దివ్యమైన దారిలో నడపడానికి పటిష్టమైన విద్యావిధానం అత్యవసరం. దాన్ని ఎలా నిర్మించాలన్నదాని మీద సెప్టెంబర్ 30లోగా సూచనలు ఇవ్వవలసిందిగా సంబంధితులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను.

**(ఈనాడు సౌజన్యంతో)**

**(నూతన జాతీయ విద్యావిధానంపై లోక్‌సత్తా ఇప్పటికే తన సూచనల్ని, ప్రతిపాదనల్ని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖకు అందచేసిన సంగతి తెలిసిందే. అందరికీ నాణ్యమైన విద్య కోసం కేంద్రానికి ఎఫ్‌డీఆర్ / లోక్‌సత్తా అందించిన సవరణలు, సూచనల పూర్తి వివరాలను** www. fdrindia.org **వెబ్‌సైట్‌లో చూడవచ్చు)**

# 'పీసా' సర్వే సాక్షిగా పాఠశాల సంక్షోభంపై పదేపదే హెచ్చరించిన సింగపూర్ ఉప ప్రధాని




భారతదేశంలో పాఠశాల విద్యా ప్రమాణాలు ఎంత అట్టడుగున ఉన్నాయో తెలియచెప్పటానికి 'అసర్' సర్వేలతోపాటు ఓఈసీడీ నిర్వహించిన పీసా సర్వేను లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ తరచూ ఉటంకిస్తుంటారు. 74 దేశాల మధ్య నిర్వహించిన పీసా సర్వేలో భారత్ 73వ స్థానంలో నిలిచింది. కిర్గిజ్‌స్తాన్ అనే అనామక దేశం వల్ల మనదేశం అట్టడుగుకు ఒక స్థానం ముందర నిలిచింది. గణితం, విశ్లేషణ, తర్కం వంటి అంశాలలో ఉన్నత పాఠశాల విద్యార్థుల మధ్య 2009లో నిర్వహించిన పీసా సర్వేలో తన విద్యారంగ స్థాయి ఎంత ఘోరంగా ఉందో బట్టబయలైతే భారత్ దాన్నో సవాలుగా తీసుకుని విద్యావ్యవస్థను ప్రక్షాళన చేయకుండా.. ఇక నుంచి పీసా సర్వేలో పాల్గొనబోమని పలాయనం చిత్తగించింది. భారతీయ విద్యావ్యవస్థకు సంబంధంలేని ప్రశ్నలు అడిగారని ఓ కుంటిసాకును చూపించింది. అయితే, ఇటీవల నీతి ఆయోగ్ కార్యక్రమం 'ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా' ప్రథమ ఉపన్యాస కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీతోపాటు పాల్గొన్న సింగపూర్ ఉప ప్రధాని తర్మన్ షణ్ముగరత్నం పీసా తేల్చిన వైఫల్యాన్ని మళ్లీ గుర్తుచేశారు. భారతదేశ పరివర్తనకు విద్యారంగాన్ని సమూలంగా మార్చాలని స్పష్టంచేశారు. భారత్‌లో తల్లి, పిల్లలు స్కూలు విద్యను అందుకునేందుకు ఐసీడీఎస్, అంగన్‌వాడీ పథకాలున్నా పాఠశాల విద్యారంగం సంక్షోభంలో ఉందన్నారు. "భారత్, తూర్పు ఆసియా దేశాల మధ్య ఉన్న ప్రధాన అంతరం పాఠశాలల నిర్వహణే. ఈ సమస్య ఈనాటిది కాదు. ఈ లోపాలు ఎంతమాత్రం సమర్థనీయం కాదు. అప్పర్‌ప్రైమరీ చదువు పూర్తికాక ముందే 43శాతం స్కూలును వదిలేస్తున్నారు. ఉపాధ్యాయుల, మరుగుదొడ్ల కొరత ఉంది. పీసా సర్వేలో విద్యాప్రమాణాలు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో తేలింది. ఐఐటీ, ఐఐఎం లాంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో చదివి ప్రపంచవ్యాప్తంగా కంపెనీలు నడుపుతున్న ప్రతిభావంతులున్న దేశంలో ఇలాంటి పరిస్థితులున్నాయి. దీనివల్ల భారత్‌లో నైపుణ్యాల్లో భారీ అంతరాలు ఏర్పడ్డాయి. అగ్రభాగాన అధిక ప్రతిభావంతులుండగా, సమాజంలోని మిగిలిన వర్గాల్లో అరకొర శక్తిసామర్థ్యాలున్నాయి. బడ్జెట్ పెంపుతో ఈ సమస్యను పరిష్కరించలేం. నిర్వహణ, పని సంస్కృతితోనే ఇది సాధ్యమవుతుంది. అవసరానికి మించి తయారవుతున్న గ్రాడ్యుయేట్లలో బాహ్య ప్రపంచ సంబంధ నైపుణ్యాలు, పరిజ్ఞానం కొరవడుతున్నాయి" అని షణ్ముగరత్నం అన్నారు. యువతరానికి ఉద్యోగాలు కల్పించాలన్నా, సమ్మిళిత వృద్ధిని సాధించాలన్నా, అల్పాదాయ వర్గాల ఆదాయం పెంచాలన్నా వచ్చే 20 ఏళ్లలో భారత్ 8-10శాతం వృద్ధి రేటును కొనసాగించాలని అన్నారు. ముఖ్యమైన సంస్కరణల్ని తెచ్చుకోకుండా భారత్ ఈ వృద్ధి రేటును సుస్థిరంగా కొనసాగించలేదన్నారు. చైనా తలసరి ఆదాయం కన్నా భారత్ తలసరి ఆదాయం రెండున్నర రెట్లు తక్కువని, అయితే అంతర్జాతీయ ముఖచిత్రాన్ని మార్చగల భిన్నమైన దేశం భారత్ అని అన్నారు. ఆర్థిక వ్యవస్థను నియంత్రించటంలో ఎక్కువ చొరవ చూపిన భారత్.. సామాజిక, మానవ వనరుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందన్నారు. మనదేశానికి పనికిరాని కేంద్రీకృత పాలన వంటి విషయాల్లో సింగపూర్ నామస్మరణలో మునిగితేలే తెలంగాణ, ఏపీ సహా వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు, కేంద్రప్రభుత్వం విద్య, మానవ వనరుల అభివృద్ధి వంటి విషయాల్లో ఆ దేశం ఇస్తున్న ఈ సూచనల్ని పాటిస్తాయా?

# భారతీయ విద్యార్థులంటేనే అనుమానంగా చూస్తున్నారు

**- ఎ. అన్నపూర్ణ,** కాలిఫోర్నియా

హైస్కూళ్లు, కాలేజీలలో విద్యాప్రమాణాలు పెరగటం లేదుగానీ, ఏదోకరకంగా మార్కులు పెంచుకునే, కొట్టేసే పద్ధతులు మాత్రం నానాటికీ అత్యాధునికమవుతున్నాయి. యాజమాన్యాలు పోటాపోటీగా విద్యార్థులకు ర్యాంకులను పంచిపెడుతున్నాయి. నాకు తెలిసి 20 సంవత్సరాల క్రితం కూడా ఎంట్రన్స్ పేపర్లు లీక్ అయ్యాయి. అప్పటినుంచీ పైకి వెల్లడికాకుండా మేనేజ్ చేస్తూ తెరచాటు నాటకాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఫలితంగా చదువు మార్కుల కర్మాగారంగా తయారైంది తప్ప వ్యక్తిత్వాన్ని, ప్రతిభను వికసింపచేసేదిగా లేకుండా పోయింది. నాసిరకంగా తయారైంది. ఒకప్పుడు ప్రతిష్టాత్మకమైన సివిల్స్‌లో, మెడికల్, ఇంజినీరింగ్ ప్రవేశపరీక్షల్లో విజయం సాధించిన విద్యార్థులకు చక్కటి పునాది ఉండేది. నైపుణ్యాలను తేలిగ్గా అందిపుచ్చుకోగలిగేవారు. వారు ఏ దేశం వెళ్లినా, ఏ ప్రాంతంలో పనిచేసినా గుర్తింపు ఉండేది. ఆయా సంస్థలు కూడా ఉన్నత విలువలు, సామర్థ్యం కలిగిన విద్యార్థులు తమ సంస్థలలో చేరడాన్ని ప్రతిష్టాత్మకంగా భావించేవి. క్రమంగా మనదేశంలో విద్యాసంస్థల స్థాయి, ముఖ్యంగా 12వ తరగతి వరకు విద్య అధమస్థానానికి దిగజారిపోవడం కలచివేస్తోంది. ఈ పరిస్థితికి కారణం ఏమిటి? విద్యార్థులు క్లాసులో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని అర్థం చేసుకుని ఆత్మవిశ్వాసంతో, సృజనాత్మకతతో మంచి స్థానాలు పొందలేకపోవడానికి కారణాలు ఏమిటి?




సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థులను, అంతర్జాతీయ ప్రమాణాలున్న విద్యాసంస్థల్లో డబ్బు కట్టి చదువుకుంటున్న కొద్దిశాతం మందిని పక్కనబెడితే, పక్కదారులు పట్టి ర్యాంకులు సాధిస్తూ డిమాండ్ ఉన్న వృత్తి విద్యలో ప్రవేశిస్తున్నవారి బెడద తీవ్రతరమవుతోంది. ఇందులో విద్యార్థులకంటే తల్లిదండ్రుల తప్పు ఎక్కువ. పరీక్ష పేపర్లు లీకై వేలు, లక్షల రూపాయలకు అమ్ముతున్నారంటే కొనేది తల్లిదండ్రులే గదా! పిల్లల జీవితాల్ని చేజేతులా పాడుచేస్తున్నది సాక్షాత్తూ కన్నవారే కావడం ఎంత దౌర్భాగ్యస్థితి! తమ పిల్లలు అవినీతితో ఎదగాలని తల్లిదండ్రులే ప్రోత్సహిస్తుంటే పిల్లలు ఏం నేర్చుకుంటారు? సంవత్సరమంతా ఎవడు కష్టపడతారు? పరీక్షలకు నెల ముందు మా నాన్న చూసుకుంటాడు. కష్టపడకుండా డబ్బుతో అన్నీ కొనుక్కోవచ్చు. ఈరోజు టెన్త్, రేపు ఇంటర్, ఆ తర్వాత మోజున్న ఏదో ఒక డిగ్రీ, ఆ తర్వాత ఉద్యోగం ఇలా జీవితకాలం అన్నింటినీ కొనుక్కోవడమే తప్ప సొంత తెలివి అర్హత అంటూ లేని అధమస్థితికి దిగజారిపోయారు. వీరు భావిభారత పౌరులుగా సాధించేదేమీ ఉండదు. విద్యను మించిన విలువైన సంపద, శక్తి ఏమీ ఉండదు. దాన్ని నిర్లక్ష్యం చేస్తే ఒక్క తప్పటడుగు దీర్ఘకాలంలో వ్యక్తిగత, సమాజ జీవితాల్ని ఛిద్రం చేస్తుంది. విద్య లక్ష్యమైన వ్యక్తిత్వం, నైపుణ్యం లేకుండా విద్యను అభ్యసించేవారు క్రమంగా అన్నీ పోగొట్టుకుని సుఖశాంతులకు దూరమవుతారు.

కార్పొరేట్ కాలేజీలను చూసి కేవలం వ్యాపారమే లక్ష్యంగా ఏ సౌకర్యాలు లేని చోట పలుకుబడి గల రాజకీయ నాయకులు వృత్తి విద్య కాలేజీలు ప్రారంభించారు. నాణ్యమైన బోధనా సిబ్బంది లేరు, సరైన వసతులు లేవు, కావలసిన పరిశోధనా పరికరాలు లేవు. కానీ కాలేజీలకు అనుమతులు లభించాయి. విద్యార్థులు డొనేషన్లు కట్టారు కనుక అతి సునాయాసంగా నాలుగు సంవత్సరాలు క్లాసులే జరగకపోయినా అత్యంత వైభవంగా ఉత్సవాలు జరిపి డిగ్రీలు మాత్రం పంచిపెడుతున్నారు. ఈ విధంగా ఇంజినీరింగ్ చదివిన విద్యార్థుల నాణ్యతా ప్రమాణాలు ఎంత గొప్పగా వుంటాయో సర్వేలు వెల్లడి చేయడం అందరికీ తెలిసిందే! ఇక ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థుల జనరల్ నాలెడ్జి కొత్త రకం జోక్‌లను సృష్టిస్తోంది. గాంధీ మహాత్ముడి గురించి కూడా పరిజ్ఞానం లేని తరం తయారవుతోంది. అలా అని ఇప్పటి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురించి తెలుసనుకుంటున్నారా? అదీ తెలియనివారు ఎక్కువమందే ఉన్నారు. విషయమేమిటో తెలియకుండా ఫేస్‌బుక్‌లో లైక్‌లు కొట్టే యువ జనాభాను మనం తయారుచేస్తున్నాం. మొన్నీ మధ్య బీహార్‌లో ర్యాంకుల ప్రహసనం గురించి మీడియా విస్తృతంగా ప్రచారం చేసింది. అనేక రాష్ట్రాల్లో

విద్యాప్రమాణాలు సంస్థలూ దాదాపు ఒక్కలాగానే ఉన్నాయని హైదరాబాద్‌లోనూ పొరపాటున బైటపడ్డ కొన్ని ఘటనలు తాజాగా రుజువు చేశాయి. పేరున్న సీనియర్ లెక్చరర్‌ని తీసుకురావాలంటే ఎక్కువ డబ్బు ఖర్చు చేయాలి, ఎందుకూ దండగ, క్రితం సంవత్సరం పాసైన సీనియర్ స్టూడెంట్‌ని అయిదువేలకే తీసుకోవచ్చు అనే అతి తెలివిగల కాలేజీ యాజమాన్యం వారు పెరిగిపోతున్నారు. ఏ కాలేజీ మీదా ప్రభుత్వ నియంత్రణ లేదు. ఎంక్వయిరీ లేదు, హడావుడే తప్ప చర్యలు లేవు, శిక్ష దాకా వెళ్లనే వెళ్లదు.

ఒకప్పుడు విదేశాలలో ఇండియా నుంచి ప్రవేశపరీక్ష ద్వారా వచ్చిన ప్రతిభ గల విద్యార్థుల పట్ల గౌరవం ఉండేది. ఇప్పుడు భారత్ నుంచి వచ్చారంటేనే అనుమానంగా చూస్తున్నారు. ఈ విషయం మీద అమెరికా వంటి దేశాల్లో ఎంతోకాలంగా పనిచేస్తున్న చాలా మంది భారతీయ ఆచార్యులు కూడా ఫిర్యాదు చేస్తున్నారు. పాఠశాల విద్య ప్రమాణాలు తగ్గిపోవటం వల్ల విద్యలో నాణ్యత బాగా తగ్గిందంటున్నారు. ఎటువంటి పాఠ్యాంశాలు ఉండాలి, విద్యను బాగు చేయటానికి ఎటువంటి చర్యలు చేపట్టాలి వంటి అంశాలపై కమిటీలు ఏర్పాటు చేస్తున్నారుగానీ, మంచి సూచనలను స్వీకరించే పరిస్థితి అంతగా కనిపించడం లేదు. కేంద్రంలో సంగతిని అలావుంచి రాష్ట్రంలోకొస్తే, ఎడ్యుకేషన్ సెక్రటరీ దగ్గర్నుంచీ అందరికీ అహం సమస్యే. సిలబస్ అన్ని వర్గాల విద్యార్థులకూ అర్థమయ్యేలా ఉండాలన్నది అధికారుల ఆలోచన అయితే.. కొన్ని సబ్జెక్టుల వరకూ ఫర్వాలేదు, ఫిజిక్స్, లెక్కలు, కెమిస్ట్రీ సబ్జెక్టులకు అది సాధ్యపడదు, విద్యార్థి తెలివి వికసించే అవకాశం ఉండదు, ఇతర కోర్సులు చేయడానికి సాధ్యపడదు అని కొందరు మేధావులు వాదిస్తున్నారు. చర్చను స్కూళ్లు, ఉపాధ్యాయులు, ఇగోల చుట్టూ కాకుండా విద్యార్థి చుట్టూ తిప్పితే తేలిగ్గా విద్యావ్యవస్థను బాగుచేయటానికి సమగ్ర పరిష్కారం లభిస్తుంది.

1980–85 ప్రాంతంలో ప్రతిభావంతులైన విద్యార్థులు ఉన్నత విద్యాసంస్థల్లో చేరడానికి ఒక రాష్ట్రం నుంచి అయిదుగురు ఉన్నారంటే చాలా ప్రతిష్ఠాత్మకంగా ఉండేది. వీరికి అమెరికాలో అయితే ఉన్నత విద్యాభ్యాసానికి ఉపకార వేతనంతో సహా పార్ట్ టైం (అదే కాలేజీలో) అర్హత లభించేది. వెళ్లినవారు కూడా కష్టపడి చదువుకుని ఉద్యోగావకాశాలు మెరుగు పరచుకునేవారు. 1990లో కూడా ఫర్వాలేదు. 2000 సంవత్సరం తర్వాత రానురానూ నాణ్యతా ప్రమాణాలు తగ్గసాగాయి. అదేసమయంలో విదేశీ విద్యకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయడం ప్రారంభించాయి. వాసి తగ్గి ప్రవాహం మొదలైంది. రానురానూ అక్రమాలు చోటుచేసుకుంటున్న కారణంగా అమెరికా వచ్చే భారత విద్యార్థులందరూ ఆ దుష్పరిణామాలను ఎదుర్కోవలసి వస్తోంది. పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాలతోనే నాణ్యమైన విద్యను అందిస్తున్నట్టు నటిస్తూ పేద, మధ్యతరగతి వర్గాలను మోసం చేస్తున్న పాలకుల వల్లే ఈ పరిస్థితి ప్రధానంగా తలెత్తుతోంది. పేద, అణగారిన వర్గాలు ఎక్కువగా చదువుకునే ప్రభుత్వ విద్యాసంస్థల్లో, చిన్నచిన్న ప్రైవేటు పాఠశాలల్లో చదువు నాణ్యత గురించి ప్రశ్నించేవారు లేరు. గతంలోనైతే ఊళ్లో కాస్త చదువుకున్నవారి పిల్లలు కూడా అవే బడుల్లో చదవటం వల్ల ఉపాధ్యాయులు మంచి బోధన చేసేవారు. ఇప్పుడు అందరికీ విద్యనందిస్తున్నామన్న నటనే తప్ప అందుకు తగ్గ పకడ్బందీ ఏర్పాట్లు చేయకపోవటం, విదేశాలకు పంపించే స్కీములను ఓట్ల కోసం మొక్కుబడిగానే అమలు చేయటం వల్ల పేద, మధ్యతరగతివారు బాగా నష్టపోతున్నారు. ప్రశ్నాపత్రాలను కొనుక్కుని పరీక్షలు రాసే బ్యాచ్ పెరిగిపోవటం కూడా ఇంకో కారణమని చెప్పనక్కర్లేదు. వ్యవస్థలోని తప్పిదానికి భారతీయ విద్యార్థులందరూ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అందరికీ నాణ్యమైన విద్యను అందించే పటిష్టమైన విద్యావ్యవస్థ స్వదేశంలో ఉంటేనే ఏ దేశానికి ఎంతమంది వెళ్లినా మనవాళ్లందరూ రాణించగలరు. అభివృద్ధి చెందిన దేశాలు కూడా భయపడేంత సామర్థ్యం కులం, మతంతో సంబంధం లేకుండా అత్యధికశాతం భారతీయ విద్యార్థులలో దాగి వుంది. కానీ వెలికితీసే విద్యావ్యవస్థను రూపొందించలేని పాలకుల పాపమే ఈ దేశానికి శాపంగా ఉంది.

విద్యావ్యవస్థలో ఎలాంటి మార్పుల్ని తీసుకురావాలో, అందరికీ నాణ్యమైన విద్యను ఎలా అందించాలో లోక్‌సత్తా చాలా స్పష్టంగా కేంద్ర ప్రభుత్వానికి తెలియచేసింది. అందరికీ నాణ్యమైన విద్య కోసం కేంద్రానికి ఎఫ్‌డీఆర్/ లోక్‌సత్తా అందించిన సవరణలు, సూచనల పూర్తి వివరాలను www.fdrindia.org వెబ్‌సైట్‌లో చూడవచ్చు. దానికితోడు తల్లిదండ్రుల ఆలోచనా ధోరణిలో కూడా మార్పు రావాలి. విద్యార్థి సామర్థ్యాలను అంచనావేసి ఏ మేరకు అతను/ఆమె చదవగలరో అందుకు తగ్గ కోర్సులలోకే ప్రోత్సహించాలి. విదేశాలకు వెళ్లాలని ఎగబడి ప్రయత్నించనక్కర్లేదు. ప్రతిభను, వ్యక్తిత్వాన్ని వికసింపచేసే విద్యను అందించి హుందాగా జీవితంలో పిల్లలు సెటిలయ్యేలా చదువు చెప్పించటం తల్లిదండ్రుల లక్ష్యం కావాలి. లేకపోతే వ్యాపార విద్యాసంస్థలకు, తల్లిదండ్రులకు పెద్ద తేడా ఏమీ ఉండదు. విద్యార్థులారా! మంచి చదువు కోసం తల్లిదండ్రుల్ని, విద్యాసంస్థల్ని, ప్రభుత్వాల్ని డిమాండ్ చేయండి.

# భవిత నిరుద్యోగమయం, అశాంతి నిలయం

-ఆకార్ పటేల్

నాలుగేళ్లలో భారత్ ప్రపంచంలోకెల్లా అత్యధిక శ్రామిక జనాభా ఉన్న దేశంగా మారుతుంది. దాదాపు జనాభాలో 87శాతం మంది పనిచేయ గలవారై ఉంటారు. దేశాల శ్రామిక జనాభా అలాంటి అత్యధిక నిష్పత్తికి చేరినప్పుడు ఆ దేశాలు జనాభావరమైన అనుకూలతను సంపాదిస్తుందని ఆశిస్తారు. అత్యధిక శాతం పౌరులు పనిచేస్తున్నవారు కావడం వల్ల ఆర్థిక వృద్ధి పెరగడమే అందుకు కారణమనేది స్పష్టంగానే కనిపిస్తుంది. త్వరలోనే భారత్ అలాంటి స్థానానికి చేరుతుందని అంచనా వేస్తున్నారు, ఆశిస్తున్నారు.




అయితే, ఈ అంశంపై రెండో అభిప్రాయం కూడా ఉంది. 'ఇండియా స్పెండ్' అనే గణాంకాలపై (డేటా) ఆధారపడిన ఒక పాత్రికేయ సంస్థ ఈ ఉద్యోగితా పరిస్థితిని పరిశీలించి తాము గమనించిన ఆరు వాస్తవాలను తన నివేదికలో పేర్కొంది. అవి:

1) 2015లో ఎనిమిది ముఖ్య భారత పరిశ్రమలలోని పెద్ద కంపెనీలు, ఫ్యాక్టరీలు సంఘటిత రంగంలో గత ఏడేళ్లలోనే అతి తక్కువగా అదనపు ఉద్యోగాలు సృష్టించాయి 2) రివాజుగా నెలసరి వేతనంగానీ, లేదా సామాజిక భద్రతాపరమైన ప్రయోజనాలుగానీ లేని అసంఘటిత రంగంలోని ఉద్యోగాల నిష్పత్తి 2017లో 93శాతానికి చేరనుంది 3) 47శాతం ఉపాధిని కల్పించేదిగా ఉన్న వ్యవసాయరంగ వృద్ధి 2014-15లో 1శాతంగా నమోదైంది. దీంతో గ్రామీణ వేతనాలు గత దశాబ్దంలోకెల్లా అతి తక్కువకు పడిపోయాయి. 4) ఉపాధి దొరికినవారిలో కూడా ఇంచుమించు 60శాతానికి ఏడాది పొడవునా ఉపాధి లభించటం లేదు. అంటే పాక్షిక నిరుద్యోగం, తాత్కాలిక ఉద్యోగాల సమస్య విస్తృతంగా వ్యాపించి ఉన్నదని అర్థం. 5) కంపెనీల ఏర్పాటు మందగించిపోయి 2009 స్థాయిలకు పడిపోయింది. ప్రస్తుతం ఉన్న కంపెనీలలో వృద్ధి గత ఐదేళ్లలోనే కనిష్టంగా, 2శాతంగా ఉంది. 6. సుసంఘటితమైన భారీ కంపెనీలే ఉపాధి కల్పనకు కీలకంగా ఉన్న పరిస్థితుల్లో.. భారీ కార్పొరేషన్లు, బ్యాంకులు ఆర్థికంగా తీవ్ర ఒత్తిడికి గురవుతున్నందున కంపెనీల సగటు పరిమాణం తగ్గుతున్నది.. తమను ఇముడ్చుకోగల సామర్థ్యంలేని వాతావరణంలోకి అతి పెద్ద శ్రామిక శక్తి ప్రవేశిస్తోందని ఇది సూచిస్తోంది.

1991 తర్వాత భారత్ అత్యధిక వృద్ధిని నమోదు చేసినా, జనాభాలో సగం కంటే తక్కువే పూర్తి ఉపాధిని పొందినవారనే వాస్తవాన్ని ఈ నివేదిక ఎత్తిచూపింది. దీనితో పోలిస్తే, చైనాలో "1991-2013 మధ్య ఉద్యోగాల సంఖ్య 62.8 కోట్ల నుంచి 77.2 కోట్లకు పెరిగింది. 14.4 కోట్ల ఉద్యోగాలు అదనంగా ఏర్పడ్డాయి. అయితే పనిచేసే వయస్కుల సంఖ్య 24.1 కోట్లకు పెరిగింది" అని ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమ నివేదిక తెలిపింది.

"రెండు దేశాల మధ్య ఇంత పెద్ద అంతరం ఉండటం మన ఉపాధి కల్పనా సామర్థ్యం చైనా కంటే కూడా తక్కువని సూచిస్తోంది. రాబోయే 35 ఏళ్లలో మన శ్రామికశక్తి విస్తరణ పెరుగుతూనే ఉంటుంది కాబట్టి ఇది తీవ్రమైన సవాలు."

గత 25 ఏళ్ల పరిస్థితే కొనసాగడం కాక మన ఆర్థికవ్యవస్థలో పెద్ద మార్పు ఏమైనా వస్తే తప్ప వీరందరికీ

ఉద్యోగాలు సమకూరవు. దుస్తుల ఎగుమతులు వంటి అల్ప స్థాయి వస్తుతయారీ, ఆ తదుపరి ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్ వంటి ఉన్నత స్థాయి ఉత్పత్తులకు బదిలీ కావడం అభివృద్ధి చెందడానికి దేశాలు అనుసరించిన సంప్రదాయక మార్గం.

భారత్‌లో ఈ రంగాలన్నీ ఉన్నాయి. కానీ ఏదీ భారీస్థాయిలో లేదు. ఉదాహరణకు, దుస్తుల ఎగుమతులనే చూస్తే, మనం బంగ్లాదేశ్, వియత్నాం, శ్రీలంక వంటి దేశాలతో పోటీపడాల్సి వస్తోంది. మనకంటే మరింత సమర్థవంతంగా, చౌకగా ఉత్పత్తి చేసే ఆ దేశాల చేతిలో తరచుగా మనం ఆ పోటీలో ఓడిపోవడమూ జరుగుతోంది. గత ఏడేళ్లుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగించిందంటేనే ఉపయోగించుకోగలిగిన భారీ బహిర్గత డిమాండ్ లేదని అర్థం.

సంప్రదాయక మార్గం భారత్‌కు తెరచి ఉన్నట్టయితే జనాభాపరమైన అనుకూలత వల్ల మనం ఎలా లాభపడగలం? ఇది వెంటనే మనం సమాధానం చెప్పి తీరాల్సిన ప్రశ్న. అందుకు పెద్దగా సమయమేమీ లేదు. మౌలిక సదుపాయాలు, అనుసంధానం కొరవడటం.. పెద్దఎత్తున మదుపులు సమకూరకపోవడానికి ఒక కారణం.

అర్హత కలిగిన మానవశక్తి కొరవడటం కూడా అంతే పెద్ద సమస్య. పట్టణ ఉన్నత తరగతి భారతీయులకు సమంజసమైన మంచి విద్య అందుతోంది. కాబట్టి వారికి సాపేక్షంగా సులువుగానే ఉద్యోగాలు దొరుకుతాయి. కాబట్టి ఇదో పెద్ద సమస్యంటే వారికి ఆశ్చర్యం కలగవచ్చు. అయితే అత్యధిక భారతీయ ప్రజానీకానికి అలాంటి విద్యావనరు అందుబాటులో లేదు. కాబట్టి వారు ఆధునిక ఆర్థిక వ్యవస్థలో పనిచేయడానికి సన్నద్ధులై లేరు. అసెంబ్లీ లైన్ (విడిభాగాల కూర్పు) వంటి మౌలిక స్థాయి నైపుణ్యం అవసరమైన బ్లూ కాలర్ (నిపుణ శ్రమ) విధుల విషయంలో సైతం ఇది నిజం. యాంత్రీకరణ మొత్తం కొత్త ఉద్యోగాల సంఖ్యను ఏటికేడాది తగ్గించేస్తున్న వాతావరణంలో ఫిలిప్పీన్స్ వంటి దేశాలు మన బ్యాక్‌ఎండ్ సేవల (బీపీవో) ఉద్యోగాలలో సైతం కొంత వాటాను దక్కించుకుంటున్నాయి.

ప్రధానమంత్రి ఈ సమస్యను గుర్తించి లక్షలాది మంది ప్రజలకు మౌలికమైన నిపుణ శ్రామికులను తయారుచేసే నైపుణ్యాలను అందించడం కోసం 'స్కిల్ ఇండియా' కార్యక్రమాన్ని ప్రారంభించారు. మనదేశంలోని ప్రాథమిక విద్యా నాణ్యత అధ్వాన్నంగా ఉండటం వల్ల ఈ విషయంలో సైతం ఫలితాలు రావటానికి సమయం పడుతుంది. ఆలోచించే కొద్దీ భారత్ జనాభాపరమైన అనుకూలత నుంచి లాభాన్ని పొందగలగడం మరింత కష్టమనిపిస్తుంది. పెనుమార్పేమైనా వస్తే తప్ప.. భారీ నిరుద్యోగం, అశాంతి ప్రబలే కాలం ముందున్నదని అనిపిస్తుంది. (కర్టెసీ: సాక్షి)

# ఉత్తరాంధ్ర సాగు ప్రాజెక్టులపై కొత్త రాష్ట్రంలోనూ నిర్లక్ష్యం


ఉత్తరాంధ్ర లోని సాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. మాజీ మంత్రి, ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టుల సాధన సమితి కన్వీనర్ కొణతాల రామకృష్ణ, శ్రీకాకుళం మాజీ ఎంపీ కణితి విశ్వనాథం, నీటిపారుదల శాఖ సలహాదారు సత్యనారాయణ తదితరులతో కలిసి విజయనగరం జిల్లాలోని తోటపల్లి, జంఝావతి, వట్టిగెడ్డ తదితర ప్రాజెక్టులను సందర్శించారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో నీటివనరులు సమృద్ధిగా వున్నా, వినియోగంలోకి తెచ్చే విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని నేతలు విమర్శించారు. ఇక్కడ 30లక్షల ఎకరాలు సాగుకు అనుకూలంగా ఉండగా కేవలం 8లక్షల ఎకరాలకే నీరు అందుతోందన్నారు. ఒడిషా ప్రభుత్వంతో కూర్చుని జంఝావతి



నిర్మాణంలో ఉన్న వివాదాలను పరిష్కరించుకోవాలన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తి చేయాలన్నారు. పోలవరం కుడికాలువ ద్వారా పట్టిసీమపై చూపిన శ్రద్ధ ఎడమకాలువపై పురుషోత్తమపట్నం వద్ద లిఫ్ట్ ద్వారా ఉత్తరాంధ్ర జిల్లాలకు నీరు అందించటంపై లేదని వారు విమర్శించారు. రాష్ట్రం విడిపోయాక కూడా ఉత్తరాంధ్రపై వివక్ష కొనసాగుతోందని, అనుమతులున్నా ప్రభుత్వం ఇక్కడి నీటిపారుదల ప్రాజెక్టులను పట్టించుకోవటం లేదని బాబ్జీ తదితర నాయకులు అన్నారు.

# నయీం, నవీన పిండారీలు

-కూసంపూడి శ్రీనివాస్
లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్, అధికారప్రతినిధి




మధ్య భారతంలో 19వ శతాబ్దం ప్రారంభంలో పిండారీల పేరుతో దోపిడీ ముఠాలు నానాబీభత్సం చేసి, అరాచకత్వాన్ని సృష్టించి సమాజాన్ని అతలాకుతలం చేశాయి. వాళ్ల ఆగడాలకు తాళలేక ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని బిక్కు బిక్కుమంటూ బతికేవారు. మర ఫిరంగులు, తుపాకీలు సంపా దించుకుని 1815 నాటికి ఈ పిండారీలు రాజ్‌పుటానా, మాల్వా, గుజరాత్, దక్షిణ బీహార్ ప్రాంతాలలో లక్షమందికి పైగా ఒక సైన్యంలాగా తయారయ్యారు. నిజాం రాజ్యంపైనా, ఉత్తర సర్కారులపైనా ఈ పిండారీల దండయాత్రలు చేసి దోచుకోవడం మొదలుపెట్టారు. చివరికి అప్పటి గవర్నర్ జనరల్ లార్డ్ హేస్టింగ్స్ పెద్ద ఎత్తున సైన్యాన్ని పంపి 1817 నుంచి 1820 దాకా నాలుగేళ్ల పాటు భీకర యుద్ధం చేసి పిండారీలను అంతమొందించగలిగారు. 70 ఏళ్ల స్వతంత్ర భారతంలో సాధించింది ఏమిటా అని ఆలోచిస్తే- మళ్లీ మన దేశాన్ని 1820నాటి అరాచకత్వంలోకి తీసుకుపోగలగడమే కాదూ? నవీన పిండారీల చేతుల్లో ఈ దేశాన్ని పెట్టడమే కాదూ? ఆనాడు ఓడినా ఈనాడు పిండారీలు గెలిచారు. అయితే అవినీతిలో కూరుకుపోయిన పోలీసులు, రాజకీయ నాయకులు, కొంతమంది ప్రభుత్వోద్యోగుల రూపంలో వారి దోపిడీ విధానం మారిందంతే. ఈమధ్యే జరిగిన నయీం ఎన్‌కౌంటర్ ఉదంతం తరువాత ప్రజలకు ఈ విషయం బాగా తెలిసివచ్చింది.

పోలీసులు, రాజకీయ నాయకుల పాలిట భస్మాసురహస్తంగా తయారైన కరుడుగట్టిన నేరస్తుడు నయీముద్దీన్ గ్రేహౌండ్స్ చేతిలో హతమైన తరువాత అతనితో సంబంధాలు ఉన్నాయంటూ వచ్చిన ఆరోపణలతో ఒక మాజీ మంత్రిణి, ఒక మాజీ పోలీసు ఉన్నతాధికారి భుజాలు తడుముకున్నారు. ఇరువురూ హడావుడిగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తమకేమీ సంబంధం లేదని వివరణ ఇచ్చుకున్నారు. పోలీసులు సృష్టించిన విషవృక్షం నయీం అంటూ అన్ని పత్రికల్లో అనేక కథనాలు వచ్చాయి. దీన్ని ఏ పోలీసు ఉన్నతాధికారీ ఖండించకపోవడం గమనార్హం. తనతో సంబంధాలు ఉన్న చాలామంది పెద్దల పేర్లు నయీం తన డైరీలో రాసుకోవడంతో ఎక్కడ తమ పేరు బయటకువస్తుందో అని వారు భయంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. తెలంగాణ ప్రాంతంలోని భువనగిరి అనే చిన్న ప్రాంతంలో ఒక భూస్వామి ఆగడాలను అడ్డుకోవడానికి కొంతమంది ఎంచుకున్న మార్గాలలో కొనసాగిన ఆధిపత్యపోరు చివరికి మారణహోమంగా మారింది. వేలకోట్ల రూపాయాలు దోచుకుని, ఇంత నేర సామ్రాజ్యం విస్తరించుకునే వరకూ మన పోలీసు, ఇంటెలిజెన్సు విభాగాలు ఏం చేస్తున్నాయనేది ఆ దేవునికెరుక. అయితే నయీం మరణంతో భూదందాలు, హత్యలు, సెటిల్‌మెంట్లు ఆగిపోతాయనుకుంటే పొరపాటే. నయీంలాంటి నేరస్తులు వేల సంఖ్యలో ఈ సమాజంలో స్వేచ్ఛగా తిరుగుతున్నారు. వారిని పెంచిపోషిస్తున్న వ్యవస్థలను గుర్తించి అంతమొందించాలే తప్ప కేవలం ఒక వ్యక్తి మరణంతో మార్పు రాదు.

మనదేశంలోని ప్రతి ఆరుగురు శాసనసభ్యుల్లో ఒకరు నేరచరిత్ర గలవారు. మిగిలిన ఐదుగురిలో కూడా కనీసం ఇద్దరుముగ్గురు నేరస్తుల అండదండలతో అధికారంలోకి వచ్చి తమను సమర్థించిన నేరస్తులకు అభయహస్తం అందిస్తున్నారు. వారిని చట్టం బారి నుంచి రక్షిస్తున్నారు. అలాంటప్పుడు నేరస్తుల

మనుషులు అత్యున్నతస్థానాలకు ఎగబాకటంలో ఆశ్చర్యం లేదు.


మరోపక్క న్యాయవ్యవస్థ వైఫల్యం పుణ్యమా అని కోర్టుల మీద ఎవరికీ విశ్వాసం ఉండటం లేదు. అందువల్ల ప్రజలు స్థానిక నేర ముఠాలనో, స్థానిక రాజకీయ నాయకులనో ఆశ్రయించి తమకు జరిగిన అన్యాయానికి పరిష్కారం కోరడం ఆనవాయితీ అయిపోయింది. దేశమంతటా అన్ని రంగాలలోనూ బలంగా వేళ్లూనుకున్న అవినీతి జాడ్యం పోలీసులకు కూడా సోకటంతో, చాలా సందర్భాలలో పోలీసు యంత్రాంగంలో అవినీతిపరులకు, నేరస్తుల ముఠాలకు మధ్య గాఢమైన సంబంధాలు నెలకొన్నాయి. పై అధికారులకు కోపం తెప్పించకుండా రాజకీయంగా వారికి వ్యతిరేకమైనవారి మీద మాత్రమే తమ ప్రతాపం చూపడం పోలీసులకు అలవాటైపోయింది. దాంతో ప్రజలకు పోలీసు యంత్రాంగం మీదున్న కాస్త విశ్వాసం సడలిపోతుంది. తరచూ అధికారం చేతులు మారుతూ ఉంటుంది కనుక, మళ్లీ అధికారంలోకి వచ్చిన కొత్త నాయకులు తమ వాళ్లను రక్షించుకోవడం, అదివరకు పడ్డ కష్టాలకు ప్రతిఫలం వచ్చేలా పూర్తి మద్దతునివ్వడం, పూర్వం తమను వేధించిన వాళ్ల మీద కక్ష తీర్చుకోవడం, తమ వాళ్ల మీద బలప్రయోగం చేసిన అధికారుల్ని శంకరగిరి మాన్యాలు పట్టించడం.. ఇవన్నీ షరామామూలే! ఈ నేపథ్యంలో హత్యలు చేసినందుకు ఉరిశిక్ష పడాల్సిన వాళ్లు ఘరానా మనుషులుగా చెలామణీ అవుతున్నారు. అంతటితో ఆగక రాజకీయం పేరుతో కొనసాగే దోపిడీ పుణ్యమా అని ఆ గూండాలే సాక్షాత్తూ నాయకులుగా రూపాంతరం చెందుతున్నారు. దీనికి ప్రపంచంలోనే అత్యంత అధ్వాన్నమైన జాబితాలో పేరు సంపాదించుకున్న మన ప్రభుత్వోద్యోగ వ్యవస్థ కూడా తోడయ్యింది. ఇండియాలో ప్రభుత్వాధికారులు తప్పుచేస్తే చాలా అరుదుగా బాధ్యత వహించాల్సి వస్తుందని, వారిపై కఠిన చర్యలు, శిక్షలు దాదాపుగా ఉండవని, దేశంలో అవినీతికి, మౌలిక వసతుల కొరతకు ఇక్కడి బ్యూరోక్రసీ కూడా ప్రధాన కారణమని హాంకాంగ్‌కు చెందిన పొలిటికల్ అండ్ ఎకనామిక్ రిస్క్ కన్సల్టెన్సీ తన సర్వేలో తెలిపింది. ఇది నూటికి నూరుపాళ్లు నిజం. బ్రిటీషువారి వారసత్వంగా ప్రజల నెత్తిన పెత్తనం చేయడం, పనుల కోసం వచ్చే జనం నుంచి లంచాలు గుంజడం, ప్రజల కంటే అనేకరెట్లు ఎక్కువ ఆదాయాన్ని జీతభత్యాల రూపంలో పొందడం, ఒకసారి ఉద్యోగంలో చేరాక ఎలా పనిచేసినా జీవితాంతం అందులోనే ప్రమోషన్లతో కొనసాగడం, రిటైరయ్యాక పెద్దమొత్తంలో డబ్బు పింఛనుగా పొందడం.. ఇవన్నీ కలిస్తే భారతదేశంలో సగటు ప్రభుత్వోద్యోగి. కొంతమంది ఆదర్శప్రాయ ఉద్యోగులున్నా, సగటులో మాత్రం అత్యంత అధ్వాన్నం. పేరుకే మనది గణతంత్ర దేశం కానీ, ఇక్కడి ప్రజలలో 90శాతం ప్రభుత్వోద్యోగుల ముందు ద్వితీయశ్రేణి పౌరులుగానే ఉంటున్నారు. ప్రభుత్వాధికారి చేత పనిచేయించుకోవడం కంటే ఓటు కోసం ఎంతకైనా దిగజారే నాయకులను పట్టుకోవడం తేలికని ప్రజలు భావిస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియలో చివరికి నష్టపోతున్నది ప్రజలు, ప్రజాస్వామ్యమే.

ప్రజల జీవితాల్లో ప్రతిరంగాన్నీ ప్రభావితం చేసే రాజకీయాన్ని ఇలా వదిలివేయడమే ఈ సమస్యలన్నింటికీ ప్రధాన కారణం. దీన్ని ప్రక్షాళన చేయాలంటే ప్రధానంగా మన రాజకీయ, పోలీసు, ప్రభుత్వోద్యోగ వ్యవస్థలను మొత్తం ప్రక్షాళన చేయాలి. ప్రజలు పేదరికంలో కూరుకుపోకుండా అందరికీ నాణ్యమైన విద్య, ఖర్చు లేని వైద్యం అందించాలి. ఉపాధి కల్పన రంగాలలో మౌలిక మార్పులు తీసుకురావడం, స్థానిక ప్రభుత్వాలకు నిధుల కేటాయింపు, దామాషా ఎన్నికల వ్యవస్థ లాంటివి చేపట్టాలి. దానితోపాటు ప్రభుత్వాలకి తాము ఇచ్చిన అధికారం సద్వినియోగం కావాలంటే ప్రజలలో నిరంతరం విషయపరిజ్ఞానంతో కూడిన బహిరంగ చర్చ అవసరం. అది కావాలంటే ప్రజలకు నిరంతరం పాలనాసంబంధమైన సమాచారం అందుతుండాలి. ప్రభుత్వాన్ని దాపరికం లేకుండా, ప్రజలకు అర్థమయ్యేలా నడపాలి. పరిపాలన ధర్మబద్ధంగా ఉండాలంటే, రహస్యం అనే చీకటి తొలగిపోవాలి. అదే సందర్భంలో ప్రజాస్వామ్యంలో ప్రభువులైన ప్రజలకు ప్రభుత్వ సేవలు సక్రమంగా అందేలా చేయడానికి, దోచుకునేవారి స్థానంలో చట్టసభలకు నిజాయతీపరులు, సమరుకథలు గెలవగలిగేలా ఎన్నికల వ్యవస్థను సంస్కరించడానికి కీలక అడుగుగా ప్రభుత్వ కార్యాలయాల్లో 'సర్వీస్ గ్యారంటీ' చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తీసుకురావాలి. ఇటువంటి సంస్కరణలు చేపట్టి అవినీతితో కుళ్లిపోయిన ఈ వ్యవస్థను ప్రక్షాళన చేయనంతకాలం నయీంలు నవీన పిండారీల రూపంలో పుడుతూనే ఉంటారు.

# 60శాతం శంకర్‌దాదా ఎంబీబీఎస్‌లే!

**పదో తరగతి, ఆపైన ఏవో విద్యార్హతలతో వైద్యులుగా చలామణి అవుతున్నవారు తెలుగునాట అక్షరాలా 58.9శాతం మంది ఉన్నారు. తెలుగు రాష్ట్రాల్లో కేవలం 40శాతం మంది మాత్రమే వైద్య విద్యను అభ్యసించిన అర్హులున్నారు. అలోపతి, ఆయుర్వేదం, హోమియో తదితర వివిధ విభాగాల వైద్యులు, నర్సులు, ఫార్మాసిస్టులు, ఇతర సాంకేతిక నిపుణులందరినీ కలుపుకుంటే.. మొత్తం ఆరోగ్య సిబ్బందిలో అర్హులైనవారు 20.1శాతమే. ఈ విషయంలో జాతీయ సగటు 23.3శాతం కాగా తెలుగు రాష్ట్రాలు అంతకంటే తక్కువగా ఉండటం గమనార్హం.**

**ఆయుర్వేద, హోమియో ఇలా ఏ వైద్యవిద్యను అభ్యసించినా, అసలేమీ అభ్యసించకపోయినా అలోపతి వైద్యాన్ని రోగులకు అందిస్తూ వైద్యులుగా చలామణి అవుతున్నవారు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి లక్షమంది జనాభాకు 77మంది ఉన్నారు. ఇందులో పదో తరగతి, ఆపై విద్యార్హతలతో అలోపతి వైద్యులుగా చలామణి అవుతున్నవారు ప్రతి లక్ష జనాభాకు 44.9 మంది (జాతీయ సగటు 42.2 కంటే ఎక్కువ). దీన్నిబట్టి.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అనర్హులైన వైద్యులే ఆధారంగా మారాయని తెలుస్తోంది (ఈ సంక్షోభాన్ని గుర్తించే లోక్‌సత్తా 'అందరికీ ఆరోగ్యం' విధానం గ్రామీణులకు వైద్యం అందించే ఫ్యామిలీ డాక్టర్ వ్యవస్థను గేమ్ ఛేంజర్‌గా ప్రతిపాదించింది). దేశంలోని అన్ని రాష్ట్రాలలో ఆరోగ్య సిబ్బంది అవసరాలు, పనితీరుపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నిర్వహించిన సర్వేలో ఈ వాస్తవాలు వెల్లడయ్యాయి. 2001 జనాభా లెక్కల ప్రకారం జరిపిన అధ్యయన సంచికను ఆ సంస్థ ఇటీవలే విడుదల చేసింది. తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్య సిబ్బందికి సంబంధించి డబ్ల్యూహెచ్‌వో తాజా గణాంకాలు:**




- ప్రతి లక్షమంది జనాభాలో ఆయుర్వేద వైద్యులు 5.7మంది, హోమియో 2.5, యునానీ 0.9, దంతవైద్యులు 1.3, నర్సులు 55.5, ఫార్మాసిస్టులు 24మంది
- అర్హులైన అలోపతి వైద్యులు ప్రతి లక్ష జనాభాకు కేవలం 30.1 మందే (ఇది జాతీయ సగటు 26.2 కంటే ఎక్కువ)
- మొత్తం ఆరోగ్య సిబ్బందిలో జాతీయ సగటు 46.8మంది అర్హులుండగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 42.7మందే అర్హులు
- జాతీయ స్థాయిలో అర్హులైన అన్ని విభాగాల వైద్యుల సగటు 45శాతం కాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అర్హులైన అన్ని విభాగాల వైద్యుల శాతం 40మాత్రమే

- ఇందులోనూ అలోపతిలో జాతీయ సగటు 42.7శాతం కాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అర్హులైన అలోపతి వైద్యులు కేవలం 39.1శాతమే
- మొత్తం ఆరోగ్య సిబ్బందిని పరిగణలోకి తీసుకుంటే, కేవలం 20.1శాతం మంది మాత్రమే వారి వృత్తులకు సంబంధించిన అర్హతతో సేవలందిస్తున్నారు. ఇది జాతీయ సగటు (23.3) కంటే చాలా తక్కువగా ఉండటం ఆందోళన కలిగించే విషయమే.

**పదో తరగతి, ఆపై**

- మొత్తం ఆరోగ్య సిబ్బందిలో ప్రతి లక్షమంది జనాభాకు 96.3మంది ఆరోగ్య సిబ్బంది విద్యార్హత పదో తరగతి, ఆపై కొంత మాత్రమే
- అలోపతి, ఆయుర్వేద, యునానీ, హోమియో ఇలా వివిధ విభాగాల వైద్యుల జాతీయ సగటు ప్రతి లక్ష జనాభాకు 55.1 ఉండగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 50.7గా నమోదైంది
- పదో తరగతి, ఆపై ఉత్తీర్ణతతోనే వైద్యులుగా చలామణి అవుతున్నవారు 58.9శాతం కాగా, ఇందులో కేవలం అలోపతి వైద్యులుగా చలామణి అవుతున్నవారు 58.3శాతం
- అన్ని విభాగాల వైద్యులు, నర్సులు, ఫార్మాసిస్టులు తదితర మొత్తం ఆరోగ్య సిబ్బందిలోనూ 45.3శాతం మంది కేవలం పదో తరగతి, ఆపై ఉత్తీర్ణతతోనే వైద్యం అందిస్తున్నారు.

**పట్టణ, గ్రామీణ నిష్పత్తి**

- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గ్రామీణంలో కంటే పట్టణాల్లో 2.6 రెట్లు అధికంగా అలోపతి వైద్యాన్ని పాటిస్తున్న వారున్నారు. ఈ విషయంలో జాతీయ సగటు 4 రెట్లు.
- గ్రామీణం కంటే పట్టణ హోమియో వైద్యుల జాతీయ సగటు 3.1 రెట్లు ఎక్కువ కాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 5.6 రెట్లు
- దంతవైద్యంలో జాతీయ సగటు 9.9 రెట్లు ఎక్కువకాగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 12.7 రెట్లు అధికంగా పట్టణాల్లో సేవలు అందిస్తున్నారు
- మొత్తంగా ఆరోగ్య సిబ్బందిని పరిశీలించినా జాతీయ సగటు 3.8కాగా, తెలుగు రాష్ట్రాల్లో 3.1 రెట్లు ఎక్కువగా పట్టణాల్లో సేవలు అందిస్తున్నారు
- దీన్నిబట్టి అర్హులైన ఆరోగ్య సిబ్బంది గ్రామీణంలో వైద్యసేవలందించటానికి ఆసక్తి చూపించటం లేదని తేటతెల్లమవుతోంది

**మహిళా సిబ్బంది**

- మొత్తం ఆరోగ్య సిబ్బందిలో మహిళల సంఖ్య జాతీయ సగటు (38శాతం) కంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో (32.4శాతం) తక్కువే
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మహిళా వైద్యులు అలోపతిలో 14.3శాతం, ఆయుర్వేదంలో 10.3శాతం, మొత్తంగా అన్ని విభాగాల వైద్యులనూ కలుపుకొని 14.4శాతం ఉన్నారు.

**అర్హులున్న నగరాల్లో హైదరాబాద్ బెటర్**

- అర్హులైన వైద్యుల సంఖ్యలో హైదరాబాద్ ఇతర మెట్రో నగరాల కంటే ముందుంది. ఇక్కడ ప్రతి లక్షమందికి 161.7మంది అలోపతి వైద్యులున్నారు. ఈ సంఖ్య న్యూఢిల్లీలో 154.1, చెన్నైలో 127.8, కోల్‌కతాలో 127.1, ముంబయిలో 120.8, బెంగళూరులో 118.2గా ఉంది.
- హైదరాబాద్‌లో కేవలం 15శాతం మంది మాత్రమే కార్పొరేట్ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్యాన్ని పొందగలుగుతున్నారు. మిగిలినవారు 4,000మందికి పైగా ఉన్న నకిలీ వైద్యులబారిన పడుతున్నారు.

ఈ వైఫల్యాల్ని అధిగమించి ప్రపంచంలో ఏ దేశంలోనూ అందించనంత తక్కువ ఖర్చుతో ప్రజలకమీద రూపాయి భారం లేకుండా నాణ్యమైన ఆరోగ్యం అందించేందుకు లోక్‌సత్తా ఆరోగ్య విధానాన్ని రూపొందించి కేంద్ర ప్రభుత్వానికి అందించింది. లోక్‌సత్తా 'అందరికీ ఆరోగ్యం' విధానంపై మరిన్ని వివరాలను www.fdrindia.org వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చు.

# అప్పు చేసయినా ప్రైవేటు దవాఖానకే!





ప్రభుత్వాసుపత్రులలో అరకొర సౌకర్యాలు, అధ్వాన్న సేవలకు భయపడి ఖర్చయినా సరే ప్రజలు ప్రైవేటు ఆసుపత్రుల వైపే మొగ్గుచూపుతున్నారని ఆరోగ్య శాఖ ఇటీవల విడుదల చేసిన అధ్యయనం తెలిపింది. నేషనల్ హెల్త్ అకౌంట్స్ (ఎన్‌హెచ్‌ఏ) తెలిపిన వివరాల ప్రకారం, భారతీయులు ప్రభుత్వ ఆసుపత్రులతో పోలిస్తే ప్రైవేటు దవాఖానాల్లో ఆరు రెట్లు ఎక్కువ ఖర్చు పెడుతున్నారు. 2013-14లో వైద్యారోగ్యానికి రూ. 4.5లక్షలు ఖర్చవ్వగా, ఇందులో 3.06లక్షల కోట్లు ప్రజలు తమ జేబుల్లో నుంచి చేసిన ఖర్చే. అంబులెన్స్ వంటి వైద్య సంబంధిత రవాణా సేవలకు ప్రజలు రూ. 18,149 కోట్ల వరకూ ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఒక్కో పడకకు జీతభత్యాలు సహా అన్నీ కలుపుకుని ఏడాదికి 8లక్షలు ఖర్చు చేస్తుంటే, ప్రయివేటు ఆసుపత్రుల్లో 1 కోటి రూపాయలు వరకు ఖర్చవుతోంది. నిధులు ఇంత తక్కువగా ఉన్నా కూడా, పడకల సామర్థ్యానికి రెండు, మూడు రెట్లు రోగులను ప్రభుత్వాసుపత్రులు చేర్చుకుని చికిత్సనందించే ప్రయత్నం చేస్తున్నాయి. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటం తన ప్రాథమిక బాధ్యత అని ప్రభుత్వాలు విస్మరించటం వల్ల ప్రభుత్వ స్కూళ్లు, ఆసుపత్రులకు ఈ దుస్థితి ఏర్పడింది. దీనివల్ల ప్రభుత్వం నుంచి తీసుకుంటున్న వివిధ రకాల సబ్సిడీల కంటే కూడా భారీ మొత్తం ఆర్థిక భారాన్ని ప్రజలు మోస్తున్నారు. అప్పులు కూడా చేస్తూ ఇంత కష్టపడుతున్నా నాణ్యమైన విద్య, వైద్యం అందటం లేదు. నీతి ఆయోగ్‌కి, పార్లమెంటరీ పానల్‌కు లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ అందించిన 'అందరికీ ఆరోగ్యం' నమూనాలో ఈ వాస్తవాల్ని కూడా వివరించటం జరిగింది.

# భారత్‌లో అవినీతి, పేదరికం, మత ఘర్షణలు, చదువు అందకపోవటం తీవ్ర సమస్యలు

భారతదేశాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్న సమస్యల్లో అవినీతి, పేదరికంతోపాటు మతపరమైన ఘర్షణ కూడా ఒకటని ప్రజలు భావిస్తున్నారు. ప్రపంచ ఆర్థిక వేదికకు చెందిన గ్లోబల్ షార్పర్స్ వార్షిక సర్వే ప్రకారం.. దేశాన్ని ప్రభావితం చేస్తున్న తీవ్రమైన సమస్యల్లో ప్రభుత్వ జవాబుదారీతనం, పారదర్శకత/అవినీతి ప్రథమ స్థానంలో నిలిచింది. 49.6శాతం ఇది ప్రధాన సమస్యని భావిస్తుండగా, 39.7శాతం మంది పేదరికం తీవ్ర సమస్యని విశ్వసిస్తున్నారు. మతపరమైన ఘర్షణకు 32.7శాతం, విద్య లభించకపోవడానికి 31.1శాతం మంది ఓటేశారు. ప్రపంచవ్యాప్తంగా యువత ఆందోళనలు, ప్రాధాన్యాలు, ఆలోచనా ధోరణినిని పట్టిచూపే ఈ సర్వేలో 181 దేశాలకు చెందిన 26,000మంది అభిప్రాయాలను క్రోడీకరించారు. ఇక మిగిలిన ప్రపంచం విషయానికొస్తే, వాతావరణ మార్పును తీవ్రమైన సమస్యగా అత్యధికులు నమ్ముతున్నారు. ఘర్షణలు, మత ఘర్షణలు, పేదరికం తరువాతి స్థానాల్లో ఉన్నాయి.

# అప్పుల్లో కూరుకుపోయేలా చేశారు, అప్పు పుట్టకుండా కూడా చేస్తున్నారు

ఉచిత విద్యుత్తు, రుణమాఫీలు చేసినా తెలుగు నాట రైతులు దేశంలోనే అత్యధికంగా అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నారని 2009లో అసెంబ్లీలో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ జాతీయ నమూనా సర్వే లెక్కలను ఉటంకిస్తూ వెల్లడించారు. రైతులకు కావలసింది తాత్కాలిక తాయిలాలు కాదని, రైతు ఆదాయం చుట్టూ వ్యవసాయ విధానాన్ని స్వేచ్ఛా వాణిజ్యంతో రూపొందించాలని సూచించారు. లోక్‌సత్తా వ్యవసాయ విధానం రైతులకు ఎంత లాభసాటో.. 2010లో ఎగుమతులపై నిషేధాన్ని ఎత్తివేయించి ఖజానాకు, దేశవ్యాప్త రైతులకు ఆదాయాన్ని పెంచటం, 2012లో వ్యవసాయ మార్కెట్ల మధ్య ఆంక్షల్ని తొలగించి దేశమంతా ఒకే మార్కెట్ అని చాటుతూ తెలుగు రాష్ట్రాల బీపీటీ ధాన్యం రైతులకు ఒక్క సీజన్‌లో రూ. 3600 కోట్ల ఆదాయాన్ని అందించటం ద్వారా లోక్‌సత్తా రుజువు చేసి చూపింది. కానీ పాలకులు ఈ వ్యవసాయ విధానాన్ని పట్టించుకోకుండా ఇంకా తాత్కాలిక తాయిలాల చుట్టూనే తిరుగుతుండటంతో 2013 ఎన్ఎస్ఎస్‌వో సర్వేలో కూడా తెలుగు ప్రాంత రైతులే అప్పుల్లో దేశంలో నెంబర్‌వన్‌గా కొనసాగుతున్నారు.




2012 జులై నుంచి 2013 జూన్ వరకు జాతీయ నమూనా సర్వే కార్యాలయం (ఎన్ఎస్ఎస్‌వో) నిర్వహించిన పరిస్థితుల మదింపు (సిచ్యుయేషన్ అసెస్‌మెంట్) సర్వే ప్రకారం.. దేశవ్యాప్తంగా సగానికిపైగా రైతు కుటుంబాలు అప్పుల భారం మోస్తుంటే, ఈ జాబితాలో రెండు తెలుగు రాష్ట్రాలు తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. అత్యధికంగా ఆంధ్రప్రదేశ్‌లో 92.9శాతం, తెలంగాణలో 89.1శాతం రైతుల కుటుంబాలు అప్పుల్లో మునిగిపోయాయి. దేశవ్యాప్తంగా ఉన్న 9కోట్ల అన్నదాత బిరుదాంకితుల కుటుంబాల్లో 4.7 కోట్లు (52శాతం) అప్పుల్లోనే ఉన్నట్టు తేలింది. ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల రైతులే ఎక్కువగా అప్పుల్లో ఉన్నట్టు బైటపడింది. తమిళనాడులో 82.5శాతం, కేరళలో 77.7శాతం, కర్ణాటకలో 77.3శాతం కుటుంబాలు అప్పుల పాలయ్యాయి. రైతుల ఆత్మహత్యల్లో దేశంలోనే మొదటి స్థానంలో ఉన్న మహారాష్ట్రలో మాత్రం అప్పుల ఊబిలో ఉన్న రైతు కుటుంబాల సంఖ్య 57.3శాతంగా ఉంది. ఉత్తరాదిలో ఒక్క రాజస్తాన్‌లో మాత్రమే 61.8శాతం రైతులు అప్పుల్లో ఉన్నట్టు తేలింది. దేశంలో అత్యల్పంగా నాగాలా ండ్‌లో 2.4 శాతం కుటుంబాలు అప్పుల్లో ఉన్నట్టు సర్వే పేర్కొంది. 2016లో ఈ గణాంకాలు కొంతమేర మారే అవకాశమున్నా, రెండు తెలుగు రాష్ట్రాల్లో రైతులే ఇంకా అప్పుల్లో అగ్రస్థానంలో కొనసాగుతున్నారని చెప్పటానికి సందేహించ నక్కర్లేదని వ్యవసాయ శాస్త్రవేత్తలు స్పష్టంచేస్తున్నారు.

మరోవైపు, రైతుల్ని అప్పుల్లో ముంచటమేకాకుండా తమ ఓట్ల కోసం వారికి అప్పు పుట్టకుండా చేసిన ఘనత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని పాలక పార్టీలకు దక్కుతుంది. రైతులకు రుణమాఫీ వల్ల ఉపయోగం ఉండకపోగా వ్యవసాయ సంక్షోభం మరింత పెరుగుతుందని 2008లో కేంద్ర ప్రభుత్వం చేసిన రుణమాఫీ అనుభవం రుజువు చేసిందని, రుణమాఫీ చేయదలచు కున్న డబ్బునే రైతులకు మరోలా వినియోగించాలని 2014 ఎన్నికల సమయంలో తెలుగుదేశం, తెరాస, కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రజలకు హామీ ఇచ్చినప్పుడు లోక్‌సత్తా పలుమార్లు హెచ్చరించింది. రైతులకు ఆదాయాన్ని పెంచే లోక్‌సత్తా సూచనల్ని ఓట్లు, సీట్లు పొందిన పార్టీలు వినిపించుకోలేదు. చివరకు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో రైతులకు రుణ మాఫీ వల్ల అప్పు పుట్టని పరిస్థితి నెలకొంది. బ్యాంకులు కుంటిసాకులతో రుణాలివ్వకుండా దాటవేస్తున్నాయి. తాము చేసిన తప్పుని బ్యాంకుల మీద నెట్టేసేందుకు అధికార పార్టీలు కూడా బ్యాంకుల వద్ద ఆందోళనలకు పిలుపునిస్తూ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కౌలు రైతుల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉంది. ఆంధ్రప్రదేశ్‌లో 2016 ఖరీఫ్ సీజన్ నాటికి 10.99 లక్షల మంది రైతులకు కౌలుదారు రుణ అర్హత కార్డులనివ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా, వారిలో ఎంతమందికిచ్చారో చెప్పటానికి కూడా అధికారులు ధైర్యం చేయటం లేదు. అనంతపురం జిల్లాల్లో జూన్ మాసం వరకు కేవలం 11మంది కౌలురైతులకు మాత్రమే బ్యాంకు రుణాలు అందాయని విశ్వసనీయ మీడియా వార్తలు వెల్లడిస్తున్నాయి. మరోవైపు, గత ఐదేళ్లలో వరి కనీస మద్దతు ధర కేవలం రూ. 220 మాత్రమే పెరిగింది. ఇటీవల లోక్‌సభలో వ్యవసాయ శాఖ సహాయమంత్రి సుదర్శన్ భగత్ ఓ ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం చెప్పారు.

# మరమనుషులకు కూడా కన్నీరు వచ్చేలా వ్యవసాయ సంక్షోభాన్ని లెక్కచెప్పిన ఉల్లి రైతు

| | |
|---|---|
| అమ్మిన పంట | 952 కిలోలు |
| కిలో | రూ.1.60కి అమ్మకం |
| వచ్చిన మొత్తం | రూ.1,523.2 |
| కమిషన్ | రూ.91.35 |
| లేబర్ చార్జీలు | 77.55 |
| ఇతర ఖర్చులు | 33.30 |
| రవాణాకు | 1,320 |
| అన్నీ పోగా మిగిలింది | రూ.1 |



**మా**ర్చి 2016లో టమాటా ధర కరీంనగర్‌లో కిలో 50పైసలు పలకటంతో రైతులు చెత్తకుండీల్లో పారబోశారు. ఆ తర్వాత జూన్‌లో అదే కిలో రూ.80-100 పలికింది. మళ్లీ ఆగస్టులో రూ.2కు పడి పోయింది. దేశంలోనే అతిపెద్ద టమాటా మార్కెట్‌గా పేరొం దిన మదనపల్లిలోనూ ఇదే పరిస్థితి. తెలుగునాట ఈ ఏడాది కూడా టమాటా రైతులు నిండా మునిగారన టానికి ఈ ధరల్లో ఈ తీవ్ర హెచ్చుతగ్గులే నిదర్శనం. ఇది కేవలం ఈ పంటకు, ఈ ఏడాదికే సంబంధించి రైతుకు జరుగుతున్న నష్టం కాదు. పాలకులు, రాజకీయ వ్యవస్థ పాపం వల్ల దాదాపు ఏటా చాలా ప్రధాన పంటల్లో జరుగుతూనే ఉంది. అందుకే.. రైతే రాజు, దేశానికి వెన్నెముక వంటి బిరుదులను చూసి మోసపోకుండా వ్యవసాయాన్ని వ్యాపారంలా చేసుకోకపోతే రైతులు బాగుపడరని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జేపీ హెచ్చరిస్తుంటారు. రైతు ఆదాయం చుట్టూ లోక్‌సత్తా చేసిన పోరాటం వల్ల ఆహారధాన్యాల ఎగుమతి పెద్దఎత్తున జరిగి అటు ఖజానాకు, ఇటు రైతులకు గణనీయంగా లాభాల్ని తెచ్చిపెట్టింది. వినియోగదారులకు ధరలు పెరిగితే మెడలో కూరగాయలు వేసుకుని ఆందోళనలు చేయటం, రైతులకు ధరలు తగ్గితే మాత్రం పట్టించుకోక పోవటమనే అసెంబ్లీ ఆనవాయితీని శాసన సభ్యుడయ్యాక జేపీ మార్చారు. టమాటాల్ని ఉదాహరణగా చూపుతూ పంటల్ని కనీస ధర లేక రైతులు ఎలా కన్నీళ్లతో పారేస్తున్నారో ఆయన అసెంబ్లీలో అవకాశం వచ్చినప్పుడల్లా పదేపదే చెబుతూ వచ్చారు. రైతులకు, వినియోగదారులకు మధ్య దళారీ వ్యవస్థ లేకుండా చేసి ఇద్దరికీ లాభం చేకూర్చేలా స్వేచ్ఛా వాణిజ్యంతో నూతన వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలన్నది లోక్‌సత్తా డిమాండ్. పాలకులకు అర్థమవుతుందో లేదోగానీ, తాజాగా మహారాష్ట్రకు చెందిన ఒక రైతు వ్యవసాయ రంగంలో వస్తున్న నష్టం మరమనుషులకు కూడా కన్నీరు వచ్చేలా ఇటీవల తన పంట లెక్కల ద్వారా వివరించారు.

పూణె జిల్లా మార్కెట్‌లో టన్ను ఉల్లిపాయలమ్మితే కేవలం ఒక్క రూపాయి వచ్చిందని దేవదాస్ పర్భానే (48) అనే రైతు ఆవేదనతో తెలిపారు. రోజూ రైతుల ఆత్మహత్యలపై వార్తలు చూస్తున్నామని, ఉల్లి ధరలు ఇలాగే ఉంటే రేపటి రోజున తనకూ అదే గతి పట్టవచ్చని అన్నారు. తనకు రూపాయి ఎలా వచ్చిందో ఆయన వివరించారు. తాను రెండెకరాల్లో ఉల్లి సాగుచేయడానికి రూ.80,000 ఖర్చు అయిందన్నారు. 18 బస్తాల్లో 952 కిలోల ఉల్లిపాయలను పూణె వ్యవసాయ మార్కెట్‌కు తరలించగా, కమిటీ కేజీకి రూ.1.60 చొప్పున చెల్లించిందన్నారు. ఈ లెక్కన తనకు రూ.1523 వచ్చాయన్నారు. తన ఖర్చులు, దళారుల కమీషన్, కూలీలకు, చిల్లర ఖర్చులు, ట్రక్కు డ్రైవర్‌కు రూ.1320.. మొత్తం రూ.1522 ఖర్చు పోగా మిగిలిన ఒక్క రూపాయి జేబులో వేసుకుని ఇంటి దారి పట్టానని పర్భానే తెలిపారు. నాలుగు నెలలు శ్రమించి పంటకు నీరు పట్టానని, కష్టం సంగతి అలా వుంచితే కనీసం పెట్టుబడి కూడా రాకపోతే ఇంకెలా సాగుచేయాలని ఆవేదనతో ప్రశ్నించారు. పర్భానే చెప్పిన రూపాయి గణాంకాలు చూసి ఆవేదన చెంది ఆత్మహత్యలకు పాల్పడకుండా, ఇలా లెక్కలతో ఆలోచించటాన్ని, బైటికి చెప్పి ప్రశ్నించటాన్ని, సరైన విధానాలున్నవారికే ఓట్లు వేయటాన్ని ఒక మంచి పరిష్కారంలో భాగంగా భావించి వ్యవసాయాన్ని వ్యాపారంగా మార్చుకోవాలని, ఆదాయాన్ని పెంచుకోవాలని రైతులను లోక్‌సత్తా కోరుతోంది.

# సైకతస్నానం

- శ్రీరమణ



**నమ్మకాలున్నవారికి పుష్కరం పెద్ద పర్వమే కావచ్చు. వేదిక ధర్మపరాయణులు ఆచరించే పవిత్ర క్రతువే కావచ్చు. కానీ ఇప్పుడు జరుగుతున్న ఆర్భాటాలను ప్రజలు గమనిస్తున్నారు. అయోమయంలో మునకలు వేస్తున్నారు. ఈ వైదిక సంధ్యలో అత్యాధునిక లేజర్ షోలు ఎంత అసందర్భమో అను కుంటున్నారు.**

పుష్కరాలు కృష్ణానదికి కాదు! నవ్యాంధ్రప్రదేశ్‌కి. ఆ రాష్ట్ర నాయకులకి. వారి పంట పండింది. ఇట్లాంటి సహజ సందర్భాలకు చంద్రబాబు రెచ్చిపోతారు. మహా శివరాత్రి, తిరుపతి బ్రహ్మోత్సవం, సూర్యగ్రహణం, రథసప్తమి– ఇలాంటి అవకాశాలు ఏవి వచ్చినా వదలరు. అవన్నీ తన ప్రమేయంతో వచ్చాయన్న స్పృహ కల్పించి, అశేష ప్రజానీకానికి తనదైన శైలిలో ఒక సందేశం ఇస్తారు. మరి పుష్కరం అంటే మామూలా? ముఖ్యమంత్రి హస్తినకు ప్రత్యేక విమానంలో వెళ్లి, చేటలంత పుష్కర శుభలేఖల్ని స్వయంగా పంచి వచ్చారు. కానీ వాటికేమంత గొప్ప ప్రతిస్పందనలు కనిపించలేదు.

నమ్మకాలున్నవారికి పుష్కరం పెద్ద పర్వమే కావచ్చు. వేదిక ధర్మపరాయణులు ఆచరించే పవిత్ర క్రతువే కావచ్చు. కానీ ఇప్పుడు జరుగుతున్న ఆర్భాటాలను ప్రజలు గమనిస్తున్నారు. అయోమయంలో మునకలు వేస్తున్నారు. ఈ వైదిక సంధ్యలో అత్యాధునిక లేజర్ షోలు ఎంత అసందర్భమో అను కుంటున్నారు. జన సామాన్యాన్ని దారి మళ్లించే ప్రయత్నంలో ఈ పుష్కరాల పడవని మహా నౌకగా చిత్రించి చుక్కానిని పెడమార్గం పట్టించే పనిలో నేతలు బిజీగా గడిపారు.

నెలరోజుల ముందు నుంచి పుష్కరాల కబుర్లు తప్ప వేరేమీ లేవు. ఎమ్మార్వో కార్యాలయం నుంచి ప్రభుత్వాసుపత్రి దాకా పుష్కరం ముసుగులేసుకు కూర్చున్నాయి. ఇక పోలీసుశాఖ అయితే చెప్పనే అక్కర్లేదు. ఎక్కడికి వెళ్లినా 'మీరో పనిచేయండి. చూస్తున్నారుగా.. ఈ హడావుడి అయ్యాక రండి' అని సెలవిచ్చారు. నిజానికి పైవారు ఏ పనిలోనూ మునిగివుండరు. చేసిన పనులన్నింటినీ, ఈ పుష్కరపర్వం పూర్తయ్యాక చూసి, బేరీజు వేసి కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలని ఒక అనుభవజ్ఞుడి సూచన. అయితే, అప్పటికి సగం దార్లు, వంతెనలు, ఘాట్లు మిగిలివుండకపోవచ్చు. 'అప్ప ఆర్భాటమేగానీ నూర్పిట్లో యిత్తు లేదని' సామెత. కృష్ణమ్మ అంత దయగా ఏమీ ప్రవహించడం లేదు. బెజవాడకి దిగువన మూరెడు ఎత్తు నీరు మాత్రమే ఉన్నది. కొందరు మేము ఈ పుష్కరవేళ కృష్ణా ఇసుకతో స్నానం చేయవచ్చునా? సైకత స్నానం మీద బ్రహ్మశ్రీ విడమరచి చెప్పాలని భక్తులు కోరుతున్నారు. 'మన అమరావతిని నిర్మించనున్నది జపాన్, చైనా, సింగపూర్ కంపెనీల వారే కదా. వారు పుష్కర స్నానాలకు వచ్చారా?' అని ఒక కాపిటలిస్టు వాకబు చేశాడు. అక్కడ భూమి పోగొట్టుకున్నవారిని 'కాపిటలిస్టు' అనే బిరుదు నామంతో వ్యవహరిస్తున్నారు.

ఎందుకో కృష్ణా పుష్కరాలని ఆరంభం నుంచి చివరి ఆస్ట్రేలియా బాణసంచా దాకా చూశాక రాజసూయ ఘట్టం గుర్తుకు వచ్చింది. అడవి రాముడు సినిమా విజయవంత మైందంటే అర్థం ఉంది కానీ, 'పుష్కరాలు విజయవంతం' అవడం అంటే ఏమిటో ప్రజలకు అర్థం కావడం లేదు. అసుర సంధ్యవేళ మహాసంకల్ప దీక్ష చెప్పించటం ఒక ఫార్సు! కిలోమీటర్ల పొడవున ఎంతో ఉదారంగా నిర్మించిన స్నానఘట్టాల మెట్లన్నీ తోలుతీసిన ఆవుదూడల్లా కనిపిస్తున్నాయి. పైన పరచిన టైల్స్‌ని పీక్కుపోవడం ప్రారంభమైంది. ఎంతైనా మన జాతి అసామాన్యమైన జాతి.

(కర్టెసీ: సాక్షి)

# ఎమ్మెల్యే నిధులను సామాజిక తనిఖీ పరిధిలోకి తేవాలి

శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు నియోజకవర్గ అభివృద్ధి పేరుతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయిస్తున్న నిధుల వ్యయంలో జవాబుదారీతనం లోపించిందని సుపరిపాలన వేదిక అధ్యక్షుడు జస్టిస్ రెడ్డప్పరెడ్డి, కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి అన్నారు. ఈ పథకం కింద ప్రతి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి ఏటా రూ.3కోట్లు ఇస్తున్నారని, ఈ నిధుల వ్యయంపై ఎలాంటి నియంత్రణ లేదని, నిబంధనలు పాటించటం లేదని అన్నారు. ఏటా సుమారు రూ.480కోట్లు వృధా కావటమో, నిబంధనలకమేరకు వ్యయం కాకపోవటమో జరుగుతోందని వారు మీడియా సమావేశంలో ఆక్షేపించారు. ఖజానా నియంత్రణ లేకుండా, ఏజీ ఆడిట్ లేకుండా, ఏ వేదిక మీదా చర్చ జరగకుండా పనులు చేపట్టి నిధులు వ్యయం చేయడం సమంజసం కాదన్నారు. ఎంపీలకు ఇస్తున్న ప్రత్యేక నిధులూ వ్యయం చేయకుండా మిగిలిపోతున్నాయని, దీన్ని సమీక్షించాల్సిన అవసరం ఉందని అన్నారు. నిజానికి జిల్లా ఆడిట్ అధికారి నిధుల వ్యయ గణాంకాలు తనిఖీ చేయాల్సి ఉందన్నారు. అయితే, జూన్ 30లోగా ఆడిట్ చేయకుంటే.. ఆడిట్ జరిగినట్టుగా భావించటం దారుణమన్నారు. ప్రత్యేక నిధుల కేటాయింపు ప్రక్రియను నిలుపుచేసి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సిఫార్సు చేసిన పనులు జరిగేలా నిబంధనలు సవరించాలని, ఆ నిధులు స్థానిక సంస్థలకు ఇవ్వాలని సూచించారు. నిధుల కేటాయింపు ప్రక్రియను ఆపివేయటం కుదరకుంటే, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సూచించిన పనులపై జిల్లా పరిషత్‌లు లేదా పురపాలక సంఘాల్లో చర్చించాలన్నారు. ప్రత్యేక నిధుల వ్యయంపై జవాబుదారీతనం ఉండాలని, ఆ పనులను సామాజిక తనిఖీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు.

# తెలంగాణలో యువతకు కొత్త స్వయంఉపాధి పథకం




తెలంగాణలోని నిరుద్యోగ యువతకు స్వయంఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఉపాధి పథకాన్ని చేపట్టింది. దీనిని యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. మూడు విభాగాల కింద రుణసాయం అందించనున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం నుంచే ఈ పథకం అమలవనుంది. ఈ పథకంపై జారీచేసిన మార్గదర్శక ఉత్తర్వుల ప్రకారం:

- మొదటి విభాగంలో యువతకు రూ.1లక్ష వరకు సాయం. ఇందులో 80శాతం సబ్సిడీ, మిగిలిన 20శాతం రుణంగా పరిగణిస్తారు
- రెండో విభాగంలో రూ.1.01 లక్షల నుంచి రూ.రెండు లక్షల వరకు సాయం. ఇందులో 70శాతం సబ్సిడీ, మిగిలినది రుణం
- మూడో విభాగంలో రూ.2.01లక్షల కంటే ఎక్కువ సాయం. ఇందులో 60శాతం వరకు సబ్సిడీగా (రూ.అయిదు లక్షల పరిమితి) ఉంటుంది. మిగిలినది రుణం.

18 నుంచి 35 సంవత్సరాల వయసుగలవారు, గ్రామీణ ప్రాంతాలలో రూ.లక్ష, పట్టణ ప్రాంతాలలో 1.50లక్షల ఆదాయ పరిమితి వున్నవారు ఇందుకు అర్హులు. మొదటి విభాగంలో ఏడో తరగతి, రెండో విభాగంలో పది, మూడో విభాగంలో డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణులు అర్హులు.

యువజన సంక్షేమశాఖ జిల్లాలవారీగా లక్ష్యాలను నిర్దేశిస్తుంది. స్టెప్ సీఈవోలు మండల, పురపాలక లక్ష్యాలను నిర్దేశిస్తారు. సంబంధిత పురపాలక కమిషనర్లు, మండలాభివృద్ధి అధికారులు దరఖాస్తులు ఆహ్వానిస్తారు. ఎంపీడీవోలు, కమిషనర్లతోపాటు బ్యాంకు అధికారులు, స్టెప్ అధికారులతో కూడిన ఎంపిక కమిటీ దరఖాస్తులను పరిశీలించి, అర్హులను ఎంపిక చేస్తుంది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ తుది జాబితాను ఖరారు చేస్తుంది. చిన్న తరహా పరిశ్రమలు, విద్యావంతులకు ప్రాధాన్యం ఇస్తారు. ఎంపిక అనంతరం పారిశ్రామిక అభివృద్ధి కార్యక్రమం (ఈడీపీ) కింద శిక్షణనిచ్చి అనంతరం ఆర్థికసాయం అందిస్తారు.

# ఎంపీటీసీ, జెడ్పీటీసీల కొనసాగింపుపై తెలంగాణ ప్రభుత్వం మల్లగుల్లాలు

పంచాయతీరాజ్ వ్యవస్థలో అయిదంచెల వ్యవస్థను గతంలో ఉన్న మూడంచెల వ్యవస్థకు కుదించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. అయితే దీనిపై తుదినిర్ణయం తీసుకోవటానికి కొన్ని అవరోధాలు ఎదురయ్యే అవకాశముందని తాత్కాలికంగా నిర్ణయాన్ని పక్కన పెట్టింది.

కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా.. పరిపాలనలో ఉత్సవవిగ్రహాల్లా ఉన్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ వ్యవస్థకు బదులుగా జిల్లా, మండల, గ్రామ యూనిట్లనే కొనసాగించాలని ప్రభుత్వం యోచించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కసరత్తు కూడా ప్రారంభించింది. కొత్త జిల్లాలు వచ్చాక ప్రజలకు మరింత చేరువయ్యేందుకు మూడంచెల వ్యవస్థ మెరుగ్గా ఉపయోగపడుతుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు కూడా భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఇతర రాష్ట్రాలలోని పంచాయతీరాజ్ చట్టంపై పూర్తిస్థాయి అధ్యయనానికి కూడా అధికారులను ఆదేశించినట్టు సమాచారం. జిల్లాలను విభజిస్తే జిల్లా పరిషత్‌లను ఏం చేయాలనేది కూడా ఈ అధ్యయనం తర్వాత నివేదికలో పొందుపరచాలన్నది ఆలోచన. తమిళనాడు, కర్ణాటక, కేరళ, రాజస్తాన్‌లలో అనుసరించిన విధానాలపై నివేదిక ఇవ్వాలని భావించారు. రాష్ట్రంలో మూడంచెలుగా ఉన్న పంచాయతీరాజ్ వ్యవస్థ అయిదంచెలుగా పెరిగాక రాజకీయ జోక్యం పెరిగిపోయిందన్న విమర్శలు వినవస్తున్నాయి. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల్లో అనవసర జోక్యం పెరిగిందంటున్నారు. కేంద్రం నుంచి నిధులు నేరుగా పంచాయతీలకే వెళ్తుండటం, నిధులు లేవంటూ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు ఆందోళనలు చేయటం వంటివి కూడా విమర్శల తీవ్రతను పెంచుతున్నాయి.. 1987కు ముందున్న పంచాయతీ సమితులను అప్పటి ఎన్టీరామారావు ప్రభుత్వం రద్దు చేసింది. వాటి స్థానంలో మండల ప్రజాపరిషత్‌లను ఏర్పాటు చేసింది. 1994 పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి వచ్చాక ఈ వ్యవస్థలో కొత్త మార్పులు వచ్చాయి.

గ్రామం, మండలం, జిల్లా యూనిట్లుగా మూడంచెల వ్యవస్థ ఉన్నప్పటికీ ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు కొత్తగా వచ్చాయి. రాష్ట్రంలో ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులకు 1995లో తొలిసారిగా ఎన్నికలు జరిగాయి. కేవలం ఎంపీపీ, జెడ్పీ ఛైర్మన్ ఎన్నికకు తప్ప పరిపాలనాపరంగా ప్రమేయం తక్కువగా ఉండటంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ పదవులు అలంకారప్రాయంగా ఉన్నాయి. సర్పంచ్, మండలాధ్యక్షులు, జిల్లా పరిషత్ ఛైర్మన్ వ్యవస్థను కొనసాగించి, ఎంపీటీసీ, జెడ్పీటీసీలను రద్దుచేయాలన్న ప్రతిపాదన ముఖ్యమంత్రి పరిశీలనలో ఉంది. అయితే ఇప్పటికైతే యధాతథ పరిస్థితినే కొనసాగించాలని నిర్ణయించినట్టు గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, అధికారులు చెబుతున్నారు.

# ప్రభుత్వ కార్యాలయాల్లోనే మరుగుదొడ్లు లేవు

విజయనగరం జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు బహిరంగ మలవిసర్జన అరికట్టాలనే చిత్తశుద్ధి లేదని లోక్‌సత్తా పార్టీ ఏపీ ప్రధాన కార్యదర్శి భీశెట్టి బాబ్జీ విమర్శించారు. నిత్యం పెద్దసంఖ్యలో ప్రజలు వచ్చిపోయే జిల్లా, మండల కార్యాలయాల్లోనే టాయిలెట్లు పూర్తిస్థాయిలో లేవన్నారు. ముగ్గురు మహిళా ఎమ్మెల్యేలు ఉండి కూడా సమస్యలు చెప్పుకోవటానికి వచ్చే మహిళలకు ప్రభుత్వ కార్యాలయాల్లో మరుగుదొడ్లు సమకూర్చలేకపోతున్నారన్నారని మీడియాతో మాట్లాడుతూ అన్నారు. స్వచ్ఛభారత్‌ను స్థానిక ప్రభుత్వాల పరిధిలోకి తీసుకొస్తేనే విజయవంతమవుతుందని, ప్రభుత్వం ప్రచారం మీద కంటే పాలన మీద దృష్టి పెట్టి స్థానిక ప్రభుత్వాలకు సాధికారత కల్పించాలని బాబ్జీ డిమాండ్ చేశారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ నేతలు ఆర్. సుధాకర్, లక్కరాజు శివరామారావు, దవులూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ ఆసుపత్రిని సందర్శించిన లోక్‌సత్తా నేతలు

దేశవ్యాప్తంగా ప్రజల మీద ఆర్థిక భారం లేకుండా అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించే విధానాన్ని రూపొందించి అమలు కోసం లోక్‌సత్తా కృషి చేస్తోందని, ప్రభుత్వ వైద్యశాలలు బలోపేతం కావటం ఈ విధానంలో భాగమని పార్టీ నేతలు అన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో పడకలు తక్కువగా ఉన్నా, ప్రజల ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని వీలైనంత ఎక్కువమందికి సేవలందించే ప్రయత్నం చేయటం అభినందనీయమని, అయితే సేవలు నాసిరకంగా ఉండటం వల్ల జనం ఉన్నకొద్దీ సర్కారీ దవాఖానాలకు దూరమవుతున్నారని అన్నారు. లోక్‌సత్తా పార్టీ తెలంగాణ కమిటీ ఇటీవల హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిని సందర్శించి రోగులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి



సూపరింటెండెంట్ వెంకటేశ్వర రెడ్డిని కలిసి సమస్యలపై ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా నేతలు దుర్గారావు, సరోజినీ దేవి, రాజీవ్, శివరామకృష్ణ, కోటేశ్వరరావు, ప్రసాద్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# ఐ క్యాంప్ నిర్వహణ



లయన్స్ క్లబ్‌తో కలిసి లోక్‌సత్తా పార్టీ ఇటీవల మెహిదీపట్నం సింధు మహిళా డిగ్రీ కళాశాలలో కంటి శిబిరాన్ని నిర్వహించింది. పార్టీ స్థానిక నాయకులు గోపాల్, సాయిబాబా ఈ కార్యక్రమాలకు ఆధ్వర్యం వహించారు. వందలాది విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా కళ్లద్దాలను అందించారు. లోక్‌సత్తా పార్టీ నేతలు దుర్గారావు, సరోజాదేవి, రాజీవ్, సుబ్రమణ్యం తదితరులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# లోక్‌సత్తా పార్టీ తెలంగాణ కార్యవర్గ సమావేశం



రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, లోక్‌సత్తా పార్టీ కార్యాచరణ, సభ్యత్వ నిర్మాణంపై చర్చించేందుకు పార్టీ తెలంగాణ కార్యవర్గం హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని కార్యాలయంలో సమావేశం నిర్వహించింది. లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥పాండు రంగారావు నేతృత్వంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ జిల్లాల అధ్యక్షులు, జీహెచ్ఎంసీ కార్యవర్గం, అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

# విద్య, వైద్య రంగాలను ప్రక్షాళన చేయాలి,

## సిద్ధిపేటలో లోక్‌సత్తా పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన తెలంగాణ అధ్యక్షుడు









దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో విద్య, వైద్యరంగాలను ప్రక్షాళన చేసి అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటమే లక్ష్యంగా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పోరాడుతున్నారని, అందుకే తెలంగాణలో ప్రభుత్వ వైద్యశాలల్ని సందర్శించి సమస్యలను తెలుసుకుంటున్నామని పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండురంగారావు అన్నారు. సిద్ధిపేటలో లోక్‌సత్తా పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రిని సందర్శించారు. రోగుల సమస్యల్ని తెలుసుకుని పరిష్కారాలపై సూపరింటెండెంట్‌తో చర్చించారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన సేవల కోసం బహుముఖ పోరాటం చేస్తున్నామని, అంతిమంగా జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా అందరికీ నాణ్యమైన వైద్యాన్ని అందించేలా చేస్తామని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏ పనినీ సమగ్రంగా చేయలేకపోతోందని, ప్రజలను భ్రమల్లో కొనసాగిస్తోందని అన్నారు. ప్రత్యామ్నాయ రాజకీయాన్ని అందించే శక్తి లోక్‌సత్తాకు మాత్రమే ఉందన్నారు. తొలుత బైక్ ర్యాలీతో మెదక్ జిల్లా లోక్‌సత్తా పార్టీ అధ్యక్షుడు దేశెట్టి రాజు లోక్‌సత్తా రాష్ట్ర నేతలకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ తెలంగాణ ఉపాధ్యక్షుడు దుర్గారావు, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, సరోజాదేవి, మహిళాసత్తా అధ్యక్షురాలు పద్మావతి, యువసత్తా అధ్యక్షుడు శివరామకృష్ణ, కార్మికసత్తా అధ్యక్షుడు కొండల్‌రెడ్డి, సమతాసత్తా అధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.







ప్రపంచ పరిణామాలపై అవగాహనను, సంక్షోభాలను పరిష్కరించే దౌత్య నైపుణ్యాలను పెంచుకునే క్రమంలో కొంతమంది ఔత్సాహిక యువతీయువకులు కాంక్లేవ్ ఆఫ్ ఇంటర్నేషనల్ డిప్లొమాట్స్ వేదికగా ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఐక్యరాజ్యసమితి నమూనా (సి.ఐ.డి.ఎం.యు.ఎస్) తొలి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్

Posting Date 22-09-2016
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on September 16th 2016

# నిజాలు మాట్లాడుకుందాం-5

ఎంత సేపూ మీరు expectations reach కాలేకపోయారు,
మీ మీద expectations పెట్టుకున్నాము అంటే-

# మనది జాతి కాదా?

ఇది నా వ్యక్తిగత విషయం కాదు ..వ్యవస్థాగతమైన విషయం.

సమాజం లో రాజకీయ శూన్యత వచ్చినప్పుడు,

ప్రెస్,మీడియా కూడా వ్యవస్థ మార్పులో తమకి బాధ్యత ఉంది అని గుర్తించినప్పుడు,

ప్రతి ఒక్కరు కులం మతం పక్కన పెట్టి తమ భవిష్యత్తు గురించి, తమ పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించినప్పుడు

మాత్రమే వ్యవస్థలో మార్పు తీసుకురాగలం .



॥ షేర్ చెయ్యండి, ప్రజల్ని మేలుకొల్పండి ॥

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad